Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 118 మేడ్చల్ మల్కాజ్‌గిరి 20 మే 2023 శనివారం పేజీలు : 4

## మళ్లీ అధ్యక్ష ఎన్నికల బరిలోకి ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అధ్యక్ష ఎన్నికల బరిలోకి దిగనున్నారు. 2024 అధ్యక్ష ఎన్నికల కోసం ట్రంప్ పత్రాలను తాజాగా దాఖలు చేశారు.ట్రంప్ 2024వ సంవత్సరంలో మళ్లీ అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి తన అభ్యర్థిత్వాన్ని స్థాపించ డానికి పత్రాలను దాఖలు చేశారు. అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికల తర్వాత ఈ ప్రకటన వెలువడింది. అమెరికా సెనేట్‌లోని 50 స్థానాల్లో, రిపబ్లికన్లు 49 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారని వాషింగ్టన్ పోస్ట్ నివేదించింది.అమెరికా హౌస్‌లో 217 స్థానాల్లో రిపబ్లికన్లు, డెమొక్రాట్లు 207 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు.అధ్యక్ష ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని ట్రంప్ గత కొన్ని నెలలుగా సంకేతాలు ఇస్తున్నారు. ఇటీవల అయోవాలో జరిగిన ర్యాలీలో ట్రంప్ మాట్లాడుతూ తాను మళ్లీ పోటీ చేస్తానని ప్రకటించారు.డొనాల్డ్ ట్రంప్ 2020లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో యూఎస్ ప్రెసిడెంట్ జో బిడెన్ చేతిలో ఓడిపోయారు.



# మరాఠా గడ్డపై గులాబీ జెండా ఎగరాల్సిందే!

## డిసైడైపోయిన 'కారు సారు'

హైదరాబాద్ : తొందరలోనే జరగబోతున్న మహారాష్ట్ర ఎన్నికలపై కేసీయార్ సీరియస్ గానే దృష్టి పెట్టినట్లున్నారు. ఇందులో భాగంగానే రెండురోజులు నాందేడ్ లో క్యాంపు వేయబోతున్నారు. నాందేడ్ లో రెండురోజులు బీఆర్ఎస్ తరపున శిక్షణా తరగతులను నిర్వహించబోతున్నారు. ఈ తరగతులను కేసీయార్ దగ్గరుండి పర్యవేక్షించబోతున్నారు. అందుకనే శుక్రవారం నాందేడ్ కు వెళుతున్నారు. 288 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ తరపున అభ్యర్థులను పోటీచేయించాలన్నది కేసీయార్ పట్టుదల. ఇందుకోసం ఇప్పటికే నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున కీలక నేతలను ఎంపికచేశారు. అంటే 288 నియోజకవర్గాల నుండి ముగ్గురు చొప్పున 864 మందితో పాటు మరికొందరు కీలకనేతలను కలుపుకుని మొత్తం వెయ్యిమందికి రెండురోజులు శిక్షణిస్తారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విధానాలను జనాల్లో ప్రచారంచేయటానికే ఇపుడీ శిక్షణిస్తున్నది. ఇదే సమయంలో పార్టీ సభ్యత్వనమోదు మీద కూడా దృష్టిపెట్టబోతున్నారు. గ్రామస్థాయి నుండి జిల్లాల కేంద్రాలు అక్కడి నుండి రాష్ట్ర హెడ్ క్వార్టర్స్ వరకు సభ్యత్వనమోదును చాలా పక్కాగా చేసేందుకు యంత్రాంగాన్ని రెడీ చేస్తున్నారు. సభ్యత్వాల్లో క్రియాశీలం సాధారణమని రెండు రకాలున్నాయి. నియోజకవర్గానికి కచ్చితంగా వెయ్యిమంది క్రియాశీల సభ్యత్వాలుండాలని టార్గెట్ పెట్టుకున్నారు. రైతులు మహిళలు యువతపైనే కేసీయార్ ఎక్కువగా దృష్టిపెట్టారట. రాష్ట్రమంతా ఈనెల 22వ తేదీనుండి సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలవ్వబోతోంది. ఈలోగానే శిక్షణా తరగతులను కూడా పూర్తిచేయాలన్నది కేసీయార్ ఆలోచన. అందుకు తగ్గట్లే ప్లాన్ చేస్తున్నారు.

ఈ మొత్తం వ్యవహారాలను నూరుశాతం విజయవంతం చేసేందుకు మహారాష్ట్ర సరిహద్దుల్లోని కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ జిల్లాల్లోని పార్టీ నేతలకు బాధ్యతలు అప్పగించారు. రాబోయే ఎన్నికల్లో అన్నీ నియోజకవర్గాల్లోను పోటీచేయటం చిన్న విషయం కాదు. పోటీచేసినా సానుకూల ఫలితాలు వస్తాయన్న నమ్మకంలేదు. అయినా కేసీయార్ ఎందుకింత పట్టుదలగా ఉన్నారు ? ఎందుకంటే జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలని ఆశపడుతున్న కేసీయార్ అందుకు మహారాష్ట్రను వేదికగా చేసుకోబోతున్నారు. శివసేన బీజేపీ కాంగ్రెస్ తో పాటు అన్నీ పార్టీలు ఫియిలయ్యాయి కాబట్టి తమకు ఒక అవకాశం ఇవ్వాలని జనాలను అడగబోతున్నారు. మరి జనాలు అవకాశం ఇస్తారా లేదా అన్నది ప్రస్తుతానికైతే సస్పెన్సే.

## కేసీఆర్‌పై కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు




ఢిల్లీ: బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ పడుతున్నారని బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. లిక్కర్ స్కామ్‌లో కవిత జైలుకు వెళ్తారని అందరూ అనుకున్నారని, కవిత అరెస్ట్ కాకపోవడంతో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య.. ఒప్పందం ఉందని ప్రజలు భావిస్తున్నారని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అందుకే రాష్ట్రంలో బీజేపీ దూకుడుకు బ్రేకులు పడ్డాయని, బీజేపీలో జూపల్లి, పొంగులేటి చేరికలు ఆగిపోయాయని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కొత్త ప్రాంతీయ పార్టీకి చాన్స్ లేదని, ఒకవేళ ఎవరైనా కొత్త పార్టీ పెడితే కేసీఆర్ పురిటిలోనే చంపేస్తారని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

కాగా.. తెలంగాణకు ప్రథమ శత్రువు ప్రధాని కాదని కేసీఆరేనని తెలిపారు. ఉచిత విద్యుత్ ఇవ్వొద్దని ప్రధాని ఎక్కడా చెప్పలేదని, ఇచ్చేది సక్రమంగా ఇవ్వాలని మాత్రమే చెప్పారని గుర్తుచేశారు. పిట్టల దొర తుపాకీ రాముడిలా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని విశ్వేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు.

## తెలంగాణలో భానుడి భగభగలు.. నల్లగొండ, కరీంనగర్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు..

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్నాయి. రాష్ట్రం మొత్తం నిప్పుల కొలిమిలా మారింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వరుసగా ఎనిమిదో రోజు 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. భారీ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో.. జనాలు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలో కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. కరీంనగర్ జిల్లాలోని వీణవంక, నల్లగొండ జిల్లాలోని దామరచర్లలో 45.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. నిర్మల్ జిల్లా కడెం పెద్దూరులో 45.1 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా జన్నారంలో 44.9, సూర్యాపేట జిల్లా మోతెలో 44.8, గరిడేపల్లిలో 44.8, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 44.5, రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రాంగిలో 44.5, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 44.5, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 44.5, పెద్దపల్లి జిల్లా రామగుండంలో 44.5, కుమ్రం భీం జిల్లా కెరిమెరిలో 44.4, నిజామాబాద్ జిల్లా భోధన్‌లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

**ఖైరతాబాద్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు..** హైదరాబాద్ నగరంలో ఖైరతాబాద్‌లో అత్యధికంగా 42.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



కాప్రాలో 41.3, ఉప్పల్‌లో 41.2, చార్మినార్‌లో 41.1, కుత్బుల్లాపూర్‌లో 40.9, నాంపల్లిలో 40.7, సరూర్‌నగర్‌లో 40.5, కూకట్‌పల్లిలో 40.4, హిమాయత్‌నగర్‌లో 40.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

# దేశ రైతాంగం బాగుపడే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు

## బీఆర్ఎస్ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్



నాందేడ్: దేశంలో రైతాంగం బాగుపడే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఆగదని ఆ పార్టీ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీఆర్ఎస్ పార్టీ శిక్షణ శిబిరాన్ని సీఎం కేసీఆర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా దేశంలో సమస్యలు పరిష్కారం కాలేవని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నదేశాలైన సింగపూర్, మలేషియా గొప్పగా అభివృద్ధి చెందాయని మెచ్చుకున్నారు. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఒక ప్రత్యేక అనుబంధం ఉందని సీఎం కేసీఆర్ చెప్పారు. రెండు రాష్ట్రాలు వేల కిలోమీటర్ల మేర సరిహద్దును పంచుకుంటున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనతికాలంలోనే అనేక సమస్యలను పరిష్కరించుకున్నామని, కృష్ణా, గోదావరి నదులు పుట్టిన మహారాష్ట్రలో నీటి కొరత ఎందుకని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఇంటింటికి పుష్కలంగా తాగునీరు అందిస్తున్నామని, మహారాష్ట్రలో పలుచోట్ల వారానికి ఒకసారి మాత్రమే తాగునీరు వచ్చే దుస్థితి ఉందని సీఎం గుర్తుచేశారు. కరువుతో అల్లాడిన తెలంగాణ నేడు దేశంలో అత్యధిక ధాన్యం పండిస్తున్నదని, రైతుబంధు సాయం నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందని చెప్పారు. దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిందేమీ లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. తెలంగాణలో సాధ్యమైన అభివృద్ధి ఇతర రాష్ట్రాల్లో ఎందుకు కావడం లేదని ప్రశ్నించారు. దేశంలో రైతులు ఎప్పుడూ పోరాటం చేయాల్సిన దుస్థితి ఎందుకని నిలదీశారు. దేశమంతటా ఒక మార్పు తేవాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిందన్నారు. దేశ రైతాంగం బాగుపడే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని చెప్పారు. దేశంలో పుష్కలంగా నీటి వనరులు ఉన్నా వాడుకోలేక వృథా చేస్తున్నామని సీఎం తెలిపారు. దేశంలో ఏటా 1.40 లక్షల టీఎంసీల వర్షం పడుతుంటే మనం కేవలం 20 వేల టీఎంసీల నీటిని మాత్రమే వాడుకోగలుగుతున్నామని అన్నారు. ఇదీ దేశాన్ని ఇన్నాళ్లు పాలించిన వారి పనితీరు అని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. రైతులు ఎల్లకాలం పోరాటాలు చేస్తూ బలికావాల్సిందేనా అని ప్రశ్నించారు. ఇంత పెద్ద దేశంలో నాలుగైదు భారీ ప్రాజెక్టులు ఎందుకు కట్టకూడదని ప్రశ్నలేవనెత్తారు. ప్రస్తుతం దేశంలోని ప్రజలంతా తెలంగాణ మాడల్ కావాలని కోరుకుంటున్నారని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిందని, విద్వేష రాజకీయాలు చేసిన బీజేపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుందని చెప్పారు. కర్ణాటక ఫలితాల తర్వాత కొందరు ఏదేదో మాట్లాడుతున్నారని, వారి కలలు కల్లలే అవుతాయని అన్నారు. శిక్షణ శిబిరం ద్వారా పలువురు ఇతర పార్టీల ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కడదాకా నిలబడి పోరాడే సత్తా ఉన్నవాళ్లు మాత్రమే బీఆర్ఎస్ పార్టీలో చేరాలన్నారు. పార్టీలో చేరేవాళ్లకు ప్రజల కోసం ఎంతవరకైనా పోరాడే తెగువ ఉండాలని, నిత్యం ప్రజలతో మమేకమై వారిని చైతన్యపర్చాలని సూచించారు. ఒకసారి అడుగు ముందుకు వేస్తే వెనకడుగు వేసేది లేదని చెప్పారు. మన లక్ష్యం గొప్పదని, త్వరలోనే పార్టీ కమిటీలు నియమించుకుందామని అన్నారు. అదేవిధంగా శిబిరంలో జరిగే శిక్షణ తరగతుల సమాచారాన్ని డిజిటల్ రూపంలో అందిస్తామని, అందరూ వాటిని సమగ్రంగా తెలుసుకోవాలని సీఎం కోరారు.

# సంపాదకీయం

## 'కిమ్' కింగ్డమ్ లో కరోనా మిస్టరీ.. అసలేం జరుగుతోంది..?

శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అన్నట్లు.. ఉత్తర కొరియా లో ఆ దేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ కి తెలియకుండా చీమ కూడా చిటుక్కుమనదు. తన అధీనం లో ఉన్నదైతే కిమ్ ఏదైనా చేయగలడు కానీ.. ప్రపంచాన్ని గడగడలాడించి.. గాల్లోనే తిరుగుతూ.. లక్షల మంది ప్రాణాలు పొట్టన పెట్టుకున్న కరోనా మహమ్మారిని కిమ్ ఏం చేయగలడు. ప్రపంచ దేశాలన్నీ కరోనా బారిన పడి తేరుకుని.. టీకాలతో ఇమ్యూనిటీ పెంచుకున్నాయి. మరి ఉత్తర కొరియా పరిస్థితేంటి..? అసలు ఉత్తర కొరియాలో కరోనా కేసులు ఏ విధంగా ఉన్నాయి. తమ దేశంలో తొలి కరోనా కేసు నమోదైందని ఉత్తర కొరియా ప్రకటించి మూడు వారాలైంది. మరి అప్పటి నుంచి వైరస్ వ్యాప్తి నియంత్రణలోనే ఉందా..? దీనిపై అక్కడి ప్రభుత్వం ఏం చెబుతోంది..? ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి నెమ్మదిగా ఉత్తర కొరియాలోనూ ప్రవేశించింది. మరి ఆ దేశ అధ్యక్షుడు తన దేశంలో కరోనాను ఎలా కంట్రోల్ చేస్తున్నారు. వైరస్ వ్యాప్తి చెందకుండా మహమ్మారి బారిన పడిన వారిని నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపమని చెప్పట్లేదుగా.. ఏమో.. ఆయన కిమ్ జోంగ్ ఉన్. ఏమైనా చేయగలరు? ఇలాంటి అనుమానాలు ఎందుకు వస్తున్నాయంటే.. తన దేశంలో కరోనా తొలి కేసు నమోదైందని కిమ్ ప్రకటించి మూడు వారాలు గడుస్తోంది. కానీ దాని తర్వాత అక్కడ కరోనా నియంత్రణలోకి వచ్చిందా..? కేసులు తగ్గుముఖం పట్టాయా అనే విషయాలు ప్రపంచానికి తెలియవు? అసలు ఉత్తర కొరియాలో ఏం జరుగుతోంది..? బయటి దేశాల్లో ఉంటూ.. ఉత్తర కొరియాలో నివసిస్తున్న తమ వారితో మాట్లాడిన వారి నుంచి అంతర్జాతీయ పత్రికలు కొంత సమాచారాన్ని సేకరించాయి. దక్షిణ కొరియా రాజధాని సియోల్ ఉంటున్న ఉత్తర కొరియా వాసి చైనా మధ్యవర్తి సాయంతో తన కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడారు? ఆ ఫోన్ సారాంశం ఏంటంటే..? ఉత్తర కొరియాలోని ప్రతి ప్రావిన్స్లో కరోనా మహమ్మారి విస్తరించింది. అక్కడ చాలా మందికి జ్వరం వచ్చింది. అందరూ జ్వరం తగ్గించే మందుల కోసం చాలా ప్రయత్నిస్తున్నారు. కానీ ఆ దేశంలో ఔషధాల కొరత చాలా రోజులుగా తీవ్రంగా వేధిస్తున్న సమస్య. దాదాపు 15 శాతం జనాభా జ్వరంతో బాధపడుతున్నారు. ఔషధాలు లేకపోవడంతో దేవదారు ఆకులన్ని మరగబెట్టి ఆ రసం తాగమని అక్కడి వైద్యులు ప్రభుత్వం సూచిస్తున్నాయి. కరోనా నిర్ధరణ పరీక్షలు నిర్వహించకపోవడం వల్ల జ్వరాల సంఖ్యను బట్టే కరోనా కేసులను లెక్కించాల్సి ఉంటుంది. ఉన్న ఔషధాలను ప్రజలకు పంచిపెట్టాలని కిమ్ సైన్యానికి సూచించారు. అక్కడి ఆస్పత్రులు మెడికల్ షాపుల్లో కూడా మందులు లేవు. ఆస్పత్రికి వెళ్తే డాక్టర్లు చీటీ రాసి ఇస్తారు. ఆ మందులు చివరకు ఆపరేషన్కు అవసరమయ్యే మత్తు మందు కూడా ప్రజలే కొనుక్కోవాలి. దాదాపు ఔషధాలన్నింటినీ చైనా నుంచే దిగుమతి చేసుకుంటారని.. గత రెండేళ్లుగా సరిహద్దులను మూసివేయడంతో మందుల సరఫరాకు అంతరాయం కలిగిందని అక్కడ పని చేసే ఓ డాక్టర్ చెప్పారు. కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తి మొదలైందని ప్రకటించిన రోజే దేశం మొత్తం లాక్డౌన్ విధిస్తున్నట్లు ఉత్తర కొరియా ప్రకటించింది. ప్రజల్లో ఆందోళన మొదలైంది. చాలా మందికి ఆహారం కూడా అందుబాటులో లేదు. కొంత మందికి మాత్రం తమ ఇళ్లను వదిలి పంట పొలాల్లో పనిచేసేందుకు అనుమతిస్తున్నారు. దక్షిణ కొరియా సరిహద్దుల వెంబడి ఉత్తర కొరియాలోని ప్రాంతాలపై తీసిన చిత్రాలను దక్షిణ కొరియా వార్తా సంస్థ ఎన్కే న్యూస్ ప్రచురించడంతో ఈ విషయం బయటకు వచ్చింది. చైనా సరిహద్దుల్లోని హ్యాస్సన్ నగరంలో మే నెలలో పది రోజులపాటు ప్రజలు ఇళ్లు వదిలి వెళ్లకుండా ఆంక్షలు విధించినట్లు వెల్లడించింది. లాక్డౌన్ ఎత్తివేసిన తర్వాత చాలామంది ప్రజలు ఇళ్లలోనే కుప్పకూలినట్లు సమాచారం. ఆహారం లేక ప్రజలు చిక్కిపోయి కదలలేని పరిస్థితికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు కేవలం 70 మరణాలు మాత్రమే ఉత్తర కొరియా అధికారికంగా ప్రకటించినట్లు తెలుస్తోంది. అంటే ఉత్తర కొరియా కోవిడ్ మరణాల రేటు 0.002 శాతంగా ఉంది. ఇది ప్రపంచంలోనే అతి తక్కువ. మరోవైపు ఉత్తర కొరియా లో సరైన ఆరోగ్య వ్యవస్థ లేదని.. కరోనా టీకాలు కూడా వేయడం లేదని.. ఇంత తక్కువ కేసులు నమోదయ్యాయంటే నమ్మశక్యంగా లేదని పలువురు వైద్య నిపుణులు చెబుతున్నారు. గత వారంలో కొత్తగా నమోదైన కరోనా వైరస్ కేసులు తగ్గుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. దీనిపై అక్కడి ప్రభుత్వ వార్తా పత్రికలో ఒక సంపాదకీయాన్ని కూడా ప్రచురించారు. కోవిడ్-19 వ్యాప్తిని అధికారులు అడ్డుకోగలిగారని దీనిలో పేర్కొన్నారు. ఉత్తర కొరియాలో పరిస్థితులు ఏమీ మెరుగుపడలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన ఎమర్జెన్సీ ఆరోగ్య విభాగం అధికారి డాక్టర్ మైక్ ర్యాన్ ఆందోళన వ్యక్తం చేశారు. డేటాను పరిశీలించేందుకు ఉత్తర కొరియా అనుమతించడం లేదని అన్నారు. కేసుల విషయంపై తమకు ఎలాంటి స్పష్టత లేదని పేర్కొన్నారు. వ్యాక్సిన్లు పంపిస్తామని మళ్లీ మళ్లీ చెబుతున్నా ఉత్తర కొరియా స్పందించడం లేదని ఆయన వెల్లడించారు. టీకాల కోసం ఉత్తర కొరియా చైనా పైనే పూర్తిగా ఆధార పడుతున్నట్లు తెలుస్తోంది. మార్చి నుంచి ఏప్రిల్ మధ్య చైనా నుంచి ఉత్తర కొరియాకు దిగుమతులు రెండింతలు పెరిగాయని కస్టమ్స్ డేటా చెబుతోంది. రెండేళ్లపాటు సరిహద్దులను మూసివేసిన తర్వాత మళ్లీ ఈ ఏడాదే సేవలను ప్రారంభించారు. గత నెల్లో ఔషధాల దిగుమతులు భారీగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏప్రిల్లో చైనా నుంచి ఉత్తర కొరియా వెయ్యి వెంటిలేటర్లు దిగుమతి చేసుకుంది. కరోనా వైరస్ మహమ్మారి వ్యాప్తి మొదలైన తర్వాత ఉత్తర కొరియా వెంటిలేటర్లు దిగుమతి చేసుకోవడం ఇదే తొలిసారి. చైనా డేటాలో వెంటిలేటర్లు అంటే ఆక్సిజన్ చికిత్స అందించే చిన్నచిన్న వైద్య పరికరాలు కూడా ఉంటాయి. మరోవైపు జనవరి నుంచి ఏప్రిల్ మధ్య 90 లక్షల మాస్కను ఉత్తర కొరియా దిగుమతి చేసుకుంది. ఏప్రిల్ 17న సాయం కోసం ఏడు రవాణా విమానాలను చైనాకు ఉత్తర కొరియా పంపినట్లు దక్షిణ కొరియా ప్రభుత్వ సమాచారం వెల్లడిస్తోంది.

## వంతెన నిర్మించక.. అవస్థలు తప్పక..!



పెద్దపల్లి :వర్షాకాలం వచ్చిందంటే ఆ రైతులకు తిప్పలు తప్పవు. వాగు దాటాలంటే నానాపాట్లు పడాల్సిందే. వంతెన నిర్మించాలని ఏళ్లుగా విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చేసేదేమీ లేక దారి నిర్మించుకున్నారు. దాన్ని పటిష్టం చేసేందుకు అవసరమైన డబ్బులు లేక వెనుకడుగు వేశారు. ఇప్పుడు వర్షాలు పడుతుండటంతో వాగు ఎలా దాటాలి, తమ పొలాలకు ఎలా చేరుకోవాలన్న మీమాంసలో పడిపోయారు ఆ రైతులు. ఇది టేక్మాల్ మండలంలో పారుతున్న గుండు వాగు పరిస్థితి.టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి నుంచి పలు గ్రామీల్లో గుండువాగు కాలువ ప్రవహిస్తోంది. ఉమ్మడి అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల్లో కురిసిన వాన నీరంతా ఈ వాగు కాలువ ద్వారా టేక్మాల్ మండలంలోని నీటి వనరులకు చేరుతుంది. కాగా మండల కేంద్రం టేక్మాల్ శివారులోని ఎలకుర్తి వెళ్లే దారిలో కాలువ అవతలి వైపు వెళ్లేందుకు వంతెన లేక నానాతంటాలు పడాల్సి వస్తోంది. సదరు కాలువ అవతలి వైపు 50 ఎకరాలకు పైగా సాగు భూమి ఉంది. అక్కడ ఆరు తడి పంటలు, బోర్ల వద్ద వరి పండిస్తుంటారు.

అవతలి వైపు వెళ్లలేక..వానాకాలంలో ఈ కాలువ నీటితో నిండుగా ఉంటుంది. అధిక వర్షాలు కురిసినప్పుడల్లా దీన్ని దాటేందుకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ వంతెన నిర్మాణానికి ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఐదేళ్ల కిందట స్థానిక రైతులందరూ కలిసి రూ.2 లక్షల వరకు జమచేసి టేక్మాల్-ఎలకుర్తి తారు రోడ్డు నుంచి కాలువ వరకు ప్రత్యేకంగా రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. 50 మీటర్ల వరకు మొరం వేశారు. ప్రస్తుతం వానాకాలంలో రావడంతో ఇటీవల మరమ్మతులు సైతం చేయించారు. కాలువ దగ్గర పెద్ద సిమెంట్ పైపులు వేసేందుకు నిర్ణయించారు. కానీ అధిక మొత్తంలో డబ్బు కావాల్సి ఉండటంతో వెనుకడుగు వేశారు. దీంతో కాలువలో నీళ్లు ఎప్పటివరకు ఉంటే అప్పటి వరకు అటువైపు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

వంతెన నిర్మిస్తే మేలు..టేక్మాల్ శివారులో గుండువాగుపై వంతెన నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుందని స్థానిక రైతులు విన్నవిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది. వేసవిలో సైతం కాలువ గుట్టపై ఉన్న వ్యవసాయ క్షేత్రాలకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు వెళ్లలేని విధంగా మారింది. కాలువ లోపల నుంచి చిన్న మరమ్మతులు చేపట్టి రైతులు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఎలకుర్తి వెళ్లే దారిలో గతంలో చెక్‌డ్యాం ను నిర్మించారు. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరడంతో కాలువలో ఎక్కువ శాతం నీరు నిలువ ఉండటం లేదు. పాతదాన్ని తొలగించి కొత్తది నిర్మిస్తే మేలు. దీనివల్ల భూగర్భ జలాలు పెరిగి బోర్లు నీటిని అందిస్తాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం- అరుణ, ఏఈ, నీటిపారుదల శాఖ, టేక్మాల్

సమస్య ఇంత వరకు తమ దృష్టికి రాలేదు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతుల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

## ఆయకట్టుకు 'అమృత' జలం



పెద్దపల్లి : పల్లెల్లో కబ్జా కోరల్లో చిక్కిన చెరువులు, కుంటలను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం 'అమృత్ సరోవర్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. 75 వసంతాల స్వాతంత్య్ర సంబరాలకు గుర్తుగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలో 75 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించిన కేంద్రం ఉపాధిహామీ నిధులను అనుసంధానించింది.

ఉపగ్రహ సహకారంత మరమ్మతుకు గుర్తించిన చెరువుల జాబితాను అధికారులు ఆయా జిల్లాలకు పంపించారు. అయితే క్షేత్ర స్థాయిలో వాటిని పరిశీలించగా చాలా చెరువుల ఉనికి లేకపోయింది. మరికొన్ని చెరువులు పూడికతీతకు పనికి రాకుండా పోవడంతో ప్రత్యామ్నాయంగా మరమ్మతు అవసరమైన చెరువులను అధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. వచ్చే ఆగస్టు నాటికి 20 శాతం పనులు పూర్తి చేసి చెరువుల ప్రాంతాల్లో జాతీయ పతాకం ఎగురవేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

పారదర్శకంగా పనులు ఎంపిక చేసిన చెరువుల్లో పనుల నిర్వహణలో పారదర్శకత పాటిస్తున్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా పనులు ప్రారంభించే ముందు బ్యానర్లను కూలీలు ప్రదర్శిస్తున్న ఫొటోలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఉపగ్రహ ఛాయాచిత్రాలతో పంపించిన చెరువుల జాబితాను పరిశీలించిన అధికారులు ఖంగుతున్నారు. జిల్లాలో చాలా చోట్ల చెరువులు కనుమరుగయ్యాయి. దీంతో అందుబాటులోని తటాకాలను ఎంపిక చేశారు. మూడేళ్ల వరకు ఈ పథకంలో చెరువులను సంపూర్ణంగా అభివృద్ధి చేయనున్నారు. మొదటి ఏడాది అంటే ప్రస్తుతం 20 శాతం, వచ్చే ఏడాది 50 శాతం, చివరిలో 30 శాతం చొప్పున పనులు చేపడుతున్నారు. జిల్లాలో 75 చెరువుల పనులు చేపట్టాల్సి ఉండగా అధికారులు 84 చోట్ల గుర్తించారు. వీటిలో కొత్తవి 24, పాతవి 57 తీసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యం కంటే దాదాపు ఎక్కువగానే ప్రగతి సాధించినట్లు అధికారులు చెబుతున్నారు. పూడిక మట్టితో చెరువు కట్టలను పటిష్ఠం చేస్తున్నారు. కాలువల్లో ముళ్ల పొదలు తొలగించడంతో చెరువులోకి వరద సులువుగా చేరనుంది. ఆయకట్టులో పంటల సాగుకు నీటి సమస్య తీరనుంది.

ఎందుకీ కార్యక్రమం

ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడంలో సాగునీటి వనరులు కీలకం. వందల ఏళ్ల కిందట నిర్మించిన చెరువులు ప్రస్తుతం శిథిలావస్థలోకి చేరాయి. వీటి మరమ్మతుకు అవసరమైన నిధులు కేటాయింపునకు నోచుకోవడం లేదు. చెట్లు, ముళ్లపొదలు, పూడిక నిండి వరద నిలువ లేని స్థితిలో దర్శనమిస్తున్నాయి. ఫలితంగా కబ్జాదారుల కన్ను పడటంతో నిర్వీర్యమవుతున్నాయి. సాగునీటి వనరులను పునరుద్ధరించి, పల్లెల్లో స్వాతంత్ర్య దినోత్సవాన పండుగ వాతావరణం నింపాలని నిర్ణయించారు. ఒక్కో చెరువులో పనులకు 300-500 పని దినాలను లక్ష్యంగా విధించారు.

లక్ష్యం కంటే ఎక్కువ ప్రగతి: శ్రీధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

జిల్లాలో అమృత్ సరోవర్ పథకం కింద చెరువుల పునరుద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాదాపు లక్ష్యాల కంటే అధికంగా ప్రగతి సాధించాం. రోజువారీగా పనుల ప్రగతిపై సమీక్షిస్తున్నాం. ఆగస్టు 15 నాటికి సుందరంగా తీర్చిదిద్దుతాం. చెరువులకు అన్ని వైపులా టేకు, వెదురు, ఇతర మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించాం.

## మొక్కలు సిద్ధం.. హరితమే లక్ష్యం

గోదావరిఖని : సింగరేణి సంస్థ హరితహారానికి సిద్ధమవుతోంది.. మొక్కలు నాటేందుకు ప్రాంతాలను సిద్ధం చేసుకుంటోంది. జులై మొదటి వారంలో హరితహారం కార్యక్రమం ద్వారా లక్షల మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందుకు అవసరమైన మొక్కలను నర్సరీల్లో పెంచుతోంది. ఏడాది కాలంగా వివిధ రకాల మొక్కలను నర్సరీల్లో సంరక్షిస్తోంది. ఈ ఏడాది సింగరేణి వ్యాప్తంగా 14 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. 835 హెక్టార్లలో వాటిని నాటి సంరక్షించేందుకు చర్యలు చేపట్టనుంది. రామగుండం రీజియన్‌లోని మూడు ప్రాంతాల్లో ఈ ఏడాది 417 హెక్టార్లలో 5.40 లక్షల మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించేందుకు ఏర్పాట్లు చేసుకుంది. రామగుండం రీజియన్‌లో నాలుగు ఉపరితల గనులతో పాటు సమీపంలోని ఖాళీ స్థలాల్లో నాటేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ప్రాంతాల్లో కానుగ, వెదురు, రావి, మర్రి, వేప, చీమచింత, నారవేప, నిరుద్ధి, సాని, బట్టగనం, నేరేడు, జువ్వి, మేడి, ఉసిరి, జిట్రేగి, ఇప్ప మొక్కలను నర్సరీల్లో పెంచింది. వీటిని రహదారులతో పాటు ఓబీ కుప్పలు, బ్లాక్ ప్లాంటేషన్‌ల ద్వారా నాటి సంరక్షణ బాధ్యతలను గుత్తేదార్లకు అప్పగించి బిల్లులు చెల్లించనున్నారు. ఇప్పటికే సింగరేణి సంస్థ కోట్ల మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నాటిన మొక్కలు అడవులుగా కనిపిస్తున్నాయి. బొగ్గు గనుల ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి బ్లాక్ ప్లాంటేషన్ చేయనున్నారు. దీని కోసం సింగరేణి సంస్థ నర్సరీల్లో లక్షల మొక్కలను పెంచింది.

మియావాకీ విధానం

చైనాలో పాటించే మియావాకీ(చిట్టడవి) విధానం ద్వారా మొక్కల పెంపకానికి సింగరేణి చర్యలు తీసుకుంది. ఎక్కువ స్థలాలు కాకుండా తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు నాటి చిట్టడవిని తలపించేలా వాటిని పెంచేందుకు చర్యలు తీసుకుంది. దీని ద్వారా పర్యావరణం పెంపొందించడంతో పాటు కాలుష్యాన్ని నివారించే అవకాశం ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లోనే అడవులను తలపించే మాదిరిగా చిట్టడవులు అందుబాటులో ఉంటాయి. వాటి కోసం స్థలాలను గుర్తించి మొక్కల సంరక్షణకు చుట్టూ ప్రత్యేకమైన కంచెను ఏర్పాటు చేయనున్నారు. రామగుండం రీజియన్‌లో కొన్ని ప్రాంతాలను మియావాకీ విధానంలో ప్లాంటేషన్‌కు సింగరేణి అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుతం సింగరేణి నర్సరీల్లో నాటేందుకు సిద్ధం చేసుకున్న మొక్కలతో పాటు మరికొన్ని ప్రభుత్వానికి అప్పగించేందుకు సరిపడా ప్లాంట్లను పెంచారు.పరిసర గ్రామాలకు పంపిణీ- కల్వల నారాయణ, జీఎంసింగరేణి ప్రాంతాల్లో మొక్కలు నాటడంతో పాటు పరిసర గ్రామాలకు పంపిణీ చేసేందుకు సరిపడా మొక్కలు సిద్ధం చేశాం. సింగరేణి గనులు, ఓబీ కుప్పలతో పాటు ఖాళీ ప్రదేశాల్లో చదును చేసి అక్కడ మొక్కలు నాటుతాం. ఏటా వర్షాకాలంలో మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షిస్తున్నాం.

## బాల మేధావులూ.. ప్రేరణకు వేళాయె!

పెద్దపల్లి : పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం 'ఇన్‌స్పైర్ మనాక్' పోటీలు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని శాస్త్ర సాంకేతిక శాఖ విభాగం ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తోంది. విద్యార్థులు సామాజిక అంశాలనే పరిశోధనలకుఎంచుకొని కొత్త ఆలోచనలతో నమూనాలు రూపొందించి ప్రతిభ చాటుతున్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించాలని ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు గడువు సెప్టెంబరు 30గా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాల్సి ఉంది. కొవిడ్ కారణంగా రెండేళ్లుగా ఆన్‌లైన్‌లో పోటీలు ఏర్పాటు చేయగా ఈసారి ప్రత్యక్షంగా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నారు.

రూ.10 వేల నగదు సాయం


జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. %www.inspireawards.dst.gov.in% వెబ్‌సైట్‌లోకి వెళ్లి విద్యార్థి పేరు, తరగతి, పాఠశాల యూడైస్, ఆధార్, బ్యాంకు ఖాతా తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పరిశోధన నమూనాకు సంబంధించి సంక్షిప్తంగా వివరాలు నిక్షిప్తం చేయాలి. వీటిని పరిశీలించి ఉత్తమ పరిశోధన నమూనాలను ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. ఇందుకోసం రూ.10 వేల నగదును ఆయా విద్యార్థి ఖాతాలో నేరుగా జమ చేస్తారు. ఈ సొమ్ముతో పరిశోధనకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసుకొని జిల్లా స్థాయి వైజ్ఞానిక పోటీల్లో పాల్గొంటారు.

ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి: రవినందన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి, పెద్దపల్లి

విద్యార్థుల్లో అంతర్గతంగా దాగిన సృజనాత్మకతకు ఈ పోటీలు మంచి వేదిక. ఆసక్తి ఉన్న విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ప్రతి పాఠశాల నుంచి అయిదు నమూనాలు వచ్చేలా ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. ఈసారి ప్రత్యక్ష పోటీలు జరుగుతాయి.

## అడవుల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక

కరీంనగర్ : అడవుల అభివృద్ధితోపాటు భూగర్భ జలాల పెంపునకు అటవీ శాఖ చేపడుతున్న పనులు సత్ఫలితాలిస్తుండంతో మరిన్ని చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని రేంజ్‌ల వారీగా ప్రణాళిక తయారు చేశారు. జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో కుంటలు, మినీ పర్కలేషన్ ట్యాంకులు, చెక్‌డ్యాంలు, రాతి కట్టడాల నిర్మాణాలు చేపట్టడంతో జలనిధి సంతరించుకుంది. మరింతగా భూగర్భ జలాలు పెరిగేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా సమతుల కందకాలను తవ్వుతుండగా ఇప్పటికే కాంటూరు కందకాలను నిర్మించారు. అడవుల్లో సరిహద్దులతోపాటు అక్రమ కలప తరలింపును నిలువరించేందుకు కాంటూరు కందకాలు, జంతువులు బయటకు రాకుండా ఉండటమే కాకుండా పశువులు అడవుల్లోకి రాకుండా ముళ్ల కలిగిన



మొక్కలు(గచ్చకాయలు), వెదురు తదితర మొక్కలను నాటారు.

విస్తృతంగా మొక్కల పెంపకం

జిల్లాలో గత కొన్నేళ్లుగా మొక్కల పెంపకం చేపడుతుండగా ఈ ఏడాది మరింతగా విస్తరించేందుకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా 60 హెక్టార్ల పరిధిలో బ్లాక్ ప్లాంటేషన్, 350 హెక్టార్లతో మొక్కల మధ్య ప్లాంటేషన్(గ్యాప్), 150 హెక్టార్లలో ఔషధ మొక్కలు పెంచనున్నారు. మొత్తంగా 650 హెక్టార్ల పరిధిలో మొక్కలు ఏపుగా పెరిగేందుకు అడవుల అభివృద్ధి చేపట్టనున్నారు. ఇవేకాకుండా 54 కిలోమీటర్ల పొడవునా వెదురు, 10 కిలోమీటర్ల పొడవునా గచ్చకాయల మొక్కలను నాటనున్నారు. వివిధ ప్రాంతాల్లో 60వేల వెదురు మొక్కలు నాటించనున్నారు.

వృథా నీటికి అడ్డుకట్ట

జిల్లాలో నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా గుట్టలపై నుంచి వచ్చే వరదతో భూమి కోతకు గురికాకుండా ఉండేందుకు ప్రతి రేంజ్ పరిధిలో 200ల చొప్పున జిల్లా వ్యాప్తంగా 1000 రాతి కట్టడాలు, రూ.50లక్షలతో ఒక్కో చెక్‌డ్యాంకు రూ. 5 లక్షల వ్యయం చేస్తూ 10 చెక్‌డ్యాంలు, అటవీ ప్రాంతాల్లో ఒకొక్కటి రూ.1.50లక్షల చొప్పున 50 కుంటల నిర్మాణాలు, మూడు ప్రాంతాల్లో ఫాంపాండ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఆయా నిర్మాణాలతో అటవీ ప్రాంతాల్లో వృథా నీటికి అడ్డుకట్ట వేయడమే కాకుండా కుంటలు, చెక్‌డ్యాంలలో నీరు నిలిచి భూగర్భ జలాలు పెరిగి అడవుల అభివృద్ధి జరుగుతుంది. వన్యప్రాణుల దాహార్తి తీరేందుకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండనుంది.

పనులు కొనసాగిస్తున్నాం- బీవీరావు, జిల్లా అటవీ అధికారి, జగిత్యాల

జిల్లాలో ఉన్న అడవులను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా ప్రణాళిక తయారు చేసి పనులు కొనసాగిస్తున్నాం. గత కొన్నేళ్లుగా చేపడుతున్న అటవీ, జల సంరక్షణ పనులు సత్ఫలితాలు ఇవ్వడంతో ఈ ఏడాది మరిన్ని నిర్మాణాలు చేపడుతున్నాం. నిర్మాణాల ద్వారా వృథా నీటికి అడ్డుకట్ట వేయడమే కాకుండా నీటి నిలువతో వన్యపాణుల దాహార్తి తీరుతుంది. భూగర్భ జలాలు పెరిగి అటవీ సంపద పెరిగేందుకు దోహదపడుతుంది.

# లారీల కొరతతో నిలిచిన సేకరణ

మెట్‌పల్లి : అదనపు తూకం వేసి పంపిస్తున్నప్పటికీ కేంద్రాలకు లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో సేకరణ నిలిచిపోయింది. తరచూ మిల్లర్లు కొర్రీలు పెట్టడంతో రైతులు శుద్ధి చేయకుండా 42.50 కిలోల చొప్పున పంపిస్తేనే తీసుకుంటామని పేర్కొనడంతో మిల్లుకు పంపిస్తున్నారు. నాలుగు రోజులుగా మండల ంలోని సహకార సంఘ పరిధిలోని ఆరు కేంద్రాల్లోనే 15వేల తూకం వేసిన సంచుల నిల్వలున్నాయి. ఇందులో ఒక్క భీంరెడ్డిగూడెం కేంద్రంలోనే 6200 సంచులు నిలవ ఉండగా, మ్యాడారం తండాలో 2700, లక్ష్మీదేవిపల్లెలో 2500, సారంగాపూర్‌లో 800, పోతారంలో 1450, బట్టపల్లిలో 870 సంచుల వరకు పేరుకుపోయాయి. తూకం వేసిన సంచులు కేంద్రాలలో ఉండడంతో నిర్వాహకులు సేకరణ నిలిపివేయాల్సి వచ్చింది. అంతేకాకుండా వ్యవసాయాధికారులు సూచించిన రకాన్ని రైతులు సాగు చేస్తే ప్రస్తుతం మిల్లర్లు గ్రేడ్-1 కింద తీసుకోవడంలేదు. దీనివల్ల ప్రతి రైతు క్వింటాలుకు రూ.20 చొప్పున నష్టపోవాల్సి వస్తోంది. సారంగాపూర్ సహకార సంఘ పరిధిలో ఏటా లక్ష క్వింటాళ్ల ధాన్యం సేకరణ నిర్వహిస్తుండగా, ఇప్పటి వరకు కేవలం 34వేల క్వింటాళ్లు మాత్రమే సేకరించారు.

బస్తాపై మూడు కిలోల కోత

మల్యాల: అకాల వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన అన్నదాతపై



రైసుమిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యంలో కోత విధిస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్యాల అడ్డరోడ్డు వద్దగల సింగిల్విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిన్నటి వరకు 40 కిలోల ధాన్యం బస్తాపై అదనంగా కిలో ధాన్యం కోతవిధించిన మిల్లర్లు సోమవారం నుంచి ధాన్యం బస్తాకు 3 కిలోలు కోత విధిస్తున్నట్లు పేర్కొనడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు నెల రోజులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు పడి ధాన్యం విక్రయించిన తర్వాత బస్తాపై అదనంగా 3 కిలోలు కోత విధిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ విషయమై మల్యాల సింగిల్విండో సీఈవో గోవర్ధన్‌ను సంప్రదించగా తనకు సమాచారం లేదన్నారు. ధాన్యం బస్తాపై అదనంగా 3 కిలోలు కోత విధిస్తున్న విషయమై సంబంధిత రైసుమిల్లు యజమానులతో మాట్లాడతానని వివరించారు.

# ఆరేళ్లుగా ఎదురుచూపులే..!

నల్గొండ : ప్రాజెక్టు పనులు పట్టాలెక్కి ఏళ్లు దాటుతున్నా ముంపు బాధితులకు పరిహారం ఇంతవరకూ అందలేదు. డిండి నుంచి వచ్చే జలాలను, శ్రీశైలం మిగులు జలాలను నక్కలగండి వద్దకు చేర్చి 3.5 లక్షల ఎకరాలకు సాగు నీరు, కొన్ని గ్రామాలకు తాగునీరు అందించే ఉద్దేశంతో 2016లో నల్గొండ జిల్లా చందంపేట మండలం నక్కలగండి తండా సమీపంలో రూ.440 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు పనులు చేపట్టారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు పనులు నిధుల కొరత కారణంగా ఆరేళ్లయినా పూర్తి కాలేదు. నక్కలగండి ప్రాజెక్ట్, బ్యాలెన్సింగ్ నిర్మాణంలో నక్కలగండి తండా ముంపునకు గురవుతోంది. ముంపు వాసులకు అందాల్సిన పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ సకాలంలో అందక ఆ తండా వాసులు పట్టణాల బాట పట్టారు. అయిదేళ్ల క్రితం నక్కలగండి తండాలో వివిధ అంశాలపై సర్వేలు పూర్తి చేసి 95 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. ఏడాది క్రితం పరిహారం అందజేస్తున్నట్లు వారి వద్ద నుంచి అనేక పత్రాలు సేకరించిన అధికారులు ప్రస్తుతం అటువైపు దృష్టి సారించడం లేదని ముంపువాసులు ఆరోపిస్తున్నారు. సంక్షేమ పథకాలన్నింటినీ ఆపేసి ప్రభుత్వం తమపై వివక్ష చూపిస్తోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు చేసిన ధర్నాలు, వినతులు ఫలితంగా ఏడాది క్రితం చింతపల్లి మండలం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని పునరావాసం కోసం ఒక్కొక్కరికీ ఇస్తానన్న 240 గజాల ఇంటిస్థలం పేపర్లకే పరిమితమయ్యాయి.

నెలాఖరు వరకు జమ చేస్తాం..- చక్రపాణి, డీఈ, నీటిపారుదలశాఖ

ఈ నెలాఖరు లోపు ముంపు బాధితులకు ప్యాకేజీని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తాం. పునరావాస ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్యాకేజీ పూరైన వెంటనే పునరావాసం కల్పిస్తాం.

# ఖాళీ స్థలాలు.. అసౌకర్యాల నిలయాలు

సూర్యాపేట : పురపాలికల్లోని ఖాళీ స్థలాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు నిలవడం, పిచ్చిమొక్కలు పెరగడంతో దుర్వాసన, దోమలతో చుట్టుపక్కల నివాస గృహాలవారు ఇక్కట్లు పడుతున్నారు. భవిష్యత్తు అవసరాలకు జిల్లాలో చాలా మంది స్థలాలను కొనుగోలు చేశారు. వాటి నిర్వహణ విషయంలో కనీస చర్యలు తీసుకోవడం లేదు. దీంతో స్థలాలు మురుగు కూపాలుగా మారుతున్నాయి. జిల్లాలోని సూర్యాపేట, తిరుమలగిరి, నేరేడుచర్ల, కోదాడ, హుజూర్‌నగర్‌లో స్థిరాసి వ్యాపారం జోరుగా సాగుతోంది. కొందరు నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన ప్లాట్లు ఏర్పాటు చేస్తూ విక్రయాలు చేస్తున్నారు. గతంలో ఉన్న కాలనీలతోపాటు కొత్తగా ఏర్పడిన వాటిలో ఓపెన్ ప్లాట్లు పెద్ద సమస్యగా మారాయి. జిల్లాలోని ఐదు పురపాలికల్లో 48 ప్రాంతాల్లో ఈ సమస్య నెలకొంది.

కొరవడిన పర్యవేక్షణప్లాట్ల యజమానులు అందులో మురుగు, వర్షం నీరు, పిచ్చిమొక్కలు పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటివేమీ పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. చెత్త, డ్రైనేజీ నీళ్లు అందులోచేరి మురుగు కూపాలుగా మారుతున్నాయి. సంబంధిత కొనుగోలుదారులకు మున్సిపల్ అధికారులు అడపాదడపా నోటీసులు జారీ చేయడమే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. కొందరు స్పందించి రక్షణ చర్యలు తీసుకుంటుండగా, మరికొందరు పట్టనట్లు ఉంటున్నారు. కొందరి వివరాలు తెలియక వారికి నోటీసులు జారీ చేయలేకపోతున్నామంటూ పురపాలిక సంఘం చేతులు దులుపుకుంటోంది. ఖాళీ స్థలం పన్ను (వీఎల్‌టీ)ని యజమానులు చెల్లించాల్సి ఉంటుంది. దస్తావేజు విలువలో 0.5శాతం కట్టాలి. అంటే రూ.లక్ష విలువచేసే దానికి రూ.500 చెల్లించాలి. ఈ విషయంలోనూ వెనుకడుగు వేస్తున్నారు.

యజమానులపై చర్యలు తీసుకుంటాం-రామాంజులరెడ్డి, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట

# మండుతున్న డంపింగ్‌యార్డు



కరీంనగర్ : నిత్యం టన్నుల కొద్ది వస్తున్న చెత్తను ఎక్కడ వేయాలనే ప్రశ్న గత కొన్నేళ్లుగా వెంటాడుతుండగా.. ప్రత్యామ్నాయం లేక ఏకైక డంపింగ్‌యార్డులోనే తీసుకొచ్చి పడేస్తుండటం.. ఎండాకాలంలో మండుతుండటంతో ప్రజాప్రతినిధులకు, అధికారులకు సవాల్‌గా మారింది.. మంటలతోపాటు దట్టమైన పొగ వ్యాపిస్తుండటంతో ఆ ప్రాంతవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెండు నెలల్లో ఇలా జరగడం రెండోసారి. ప్రస్తుత పరిస్థితిపై కథనం.కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని బైపాసు రోడ్డులో డంపింగ్‌యార్డు గుట్టలుగా పేరుకుపోతుంది. ఇంటింటా సేకరిస్తున్న చెత్తను నిల్వ చేయాలంటే కత్తి మీద సాములాగా మారింది. ప్రతి రోజు సేకరిస్తున్న వ్యర్థాలను ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలు, వ్యాన్ల ద్వారా తీసుకొస్తున్నారు. అందులో స్థలం లేకపోగా పొక్లెయిన్ సాయంతో పేర్చుకుంటూ నింపేస్తున్నారు. వేసవి వచ్చిందంటే చాలు అందులో మంటలు అంటుకోవడం, పొగ వ్యాపించడం సాధారణమైంది. సమీప ప్రాంతవాసులు గాలి కాలుష్యంతోపాటు వాసన భరించలేక అవస్థలు పడుతున్నారు.

పారిశుద్ధ్య వాహనాలకు ఆటంకాలు

పొగ కమ్ముకోవడంతో చెత్త తీసుకొచ్చి డంపింగ్‌యార్డులో నిల్వ చేసేందుకు వస్తున్న పారిశుద్ధ్య వాహనాలు లోపలకు వెళ్లడం కష్టమవుతోంది. సోమవారం ఇలాగే చెత్త తీసుకొచ్చిన ట్రాక్టర్లు, వ్యాన్లు ఆ పొగలోనే వెళ్లి డంపింగ్ చేసుకొని వచ్చే వరకు డ్రైవర్లు, కార్మికులు నానావస్థ పడ్డారు.

ప్రత్యామ్నాయం అవసరం

నగరానికి ఉన్న ఏకైక డంపింగ్‌యార్డు చెత్తతో నిండి సవాల్‌గా మారగా, కొత్తగా చెత్త నిల్వ చేసేందుకు స్థలాలు లభించడం లేదు. ఉన్న దానినే భవిష్యత్తులో పార్కుగా ఉపయోగిస్తామని అంటుండగా, ప్రత్యామ్నాయం ఏమిటనే విషయం మాత్రం తెలపడం లేదు. ప్రాసెసింగ్ విధానంలో వ్యర్థాలను తగ్గిస్తామని పేర్కొంటుండగా, అదీ ఇప్పట్లో సాధ్యమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు ఏటా మండుతున్న చెత్త నిల్వ కేంద్రంలో మంటలు రాకుండా ఉండాలంటే చెత్తను ఎప్పటికి తడిగా ఉంచాలని చెబుతున్నారు. జనవరి నుంచే డ్రిప్ విధానం అవలంబిస్తే తప్ప మరో ఉపాయం లేదని కార్మికులు అంటున్నారు.

ఈ ఏడాది రెండో సారి..

డంపింగ్‌యార్డులో ఈ ఏడాది రెండోసారి మంటలు వ్యాపించాయి. మార్చి నెలలో ఒకసారి, ఆదివారం సాయంత్రం నుంచి మళ్లీ అంటుకుంది. అగ్గిని ఆర్పేందుకు ఫైరింజన్, ట్యాంకర్లు, జెట్టింగ్ మిషన్ ద్వారా నీటిని చల్లుతున్నారు. ఓ వైపు ఆర్పుతుండగానే మరో వైపు నుంచి అంటుకోవడంతో ఇబ్బందికరంగా తయారైంది. అందుల్లోంచి గ్యాస్ రావడమే కారణమని అంటున్నారు. దట్టమైన పొగతో ఆ ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు. ఈ పొగ ఒకటెండ్రు రోజుల్లో పోయేలా కనిపించడంలేదు. పరిసర ప్రాంతాలు మొత్తం పొగతో వ్యాపించి దుర్వాసన వస్తుందని అక్కడి ప్రాంతవాసులు చెబుతున్నారు.

నత్తనడకన బయోమైనింగ్

స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ద్వారా గతేడాది జూన్‌లో ప్రారంభించిన బయోమైనింగ్ నత్తనడకన సాగుతుంది. ఏడాదిలోగా డంపింగ్‌యార్డు పూర్తిగా శుభ్రం చేసి ఇవ్వాల్సి ఉంది. మరో నెల అయితే గడువు ముగుస్తుండగా ఎక్కడి చెత్త అక్కడే గుట్టలుగా కనిపిస్తోంది. రోజుకు ఎంతమేర శుద్ధి చేస్తున్నారనే లెక్కలు లేవని, శుద్ధి చేసిన వ్యర్థాలు ఎక్కడికీ, దేనికోసం తరలిస్తున్నారనే వివరాలు నగరపాలికలో కనిపించడం లేదు. వాస్తవానికి ఈ విషయాలను యార్డులో బోర్డు ప్రదర్శించాల్సి ఉంటుంది. బయోమైనింగ్ ప్రక్రియ రోజు జరుగుతుందా అంటే తెలియని గందరగోళం నెలకొంది. అక్కడికి వెళ్లి పరిశీలించిన సందర్భాల్లో ఇప్పుడే నిలిపివేశామని, సాంకేతిక కారణాలు సాకుగా చూపుతుండటం గమనార్హం.

మంటలు ఆర్పేందుకు చర్యలు

ఎండాకాలంలో ఈ సమస్య వస్తుండగా మంటలు ఆర్పేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటున్నారు. బయోమైనింగ్ వేగవంతంగా చేపట్టేందుకు మరో మిషన్ బిగించాలని ఆదేశించాం. రోజుకు 2 వేల మెట్రిక్ టన్నులు శుద్ధి చేయాలి. వచ్చే ఎండాకాలం నాటికి మొత్తం శుభ్రం చేసి, అక్కడ డంపింగ్‌యార్డు లేకుండా చేస్తాం.వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్ క్రమంగా వ్యాపిస్తున్న పొగ

# మాతా శిశు మరణాల కలవరం



కరీంనగర్ : కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 20 రోజులలో ముగ్గురు చిన్నారులు, బాలింత మృతి చెందారు. వరుస ఘటనలు అటు వైద్యులు, ఇటు కుటుంబ సభ్యుల్లో కలవరపెడుతున్నాయి. వైద్యుల నిర్లక్ష్యంతోనే ప్రాణాలు కోల్పోతున్నారని బాధితులు ఆరోపిస్తుండగా.. తమ నిర్లక్ష్యం ఏమి లేదని వారంటున్నారు. ఒక ఘటనలో మాత్రం వైద్యుడిపై చర్యలు తీసుకున్నారు. కారణాలు ఏమైనా వరుస ఘటనలతో అప్రమత్తం కావలసిన అవసరముంది.

నాణ్యమైన సేవలందాలనేది ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వం గర్భిణులకు నాణ్యమైన సేవలు అందించాలనే ధ్యేయంతో మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. వైద్య సిబ్బందినీ అందుబాటులో ఉంచింది. ఈ ఆసుపత్రిలో రోజుకు 20 నుంచి 30 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. ప్రసవం తర్వాత కేసీఆర్ కిట్టుతోపాటు నగదు బహుమతి అందజేస్తోంది. అయితే శస్త్రచికిత్సలు చేస్తున్నారని తెలిసి.. ప్రభుత్వం సాధారణ ప్రసవాలు చేయాలని ఆదేశించింది. వైద్య సిబ్బందికి అవగాహన కల్పించింది. తప్పనిసరి అయితేనే శస్త్రచికిత్స చేయాలని సూచించింది. ఈ నిర్ణయాన్ని క్షేత్రస్థాయి సిబ్బంది పాటిస్తున్నారు.

వైద్య సిబ్బంది ఏమంటున్నారంటే

కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నప్పుడు ఆసుపత్రికి వస్తుంటారని, తాము తల్లీ బిడ్డ పరిస్థితిని అంచనా వేసే లోపు ప్రాణాలు కోల్పోతుంటారని చెప్పారు. ప్రజల ప్రాణాలు కాపాడడమే తమ ముందున్న కర్తవ్యమని, సేవలో ఎలాంటి నిర్లక్ష్యం చూపమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదట సాధారణ ప్రసవం చేసేందుకు ప్రయత్నం చేస్తామని, సాధ్యం కాకపోతే శస్త్రచికిత్స నిర్వహిస్తామన్నారు. రోజుకు ఎంతోమందికి ప్రసవాలు చేస్తుంటామని, కొన్నిసార్లు పరిస్థితులు అనుకూలించక అలాంటి ఘటనలు జరుగుతుంటాయన్నారు. బాధితులు ఆరోపిస్తున్నట్లుగా నిర్లక్ష్యం ప్రదర్శించమన్నారు.

బాధితుల వాదన..

ప్రసవం కోసం తీసుకొచ్చిన తర్వాత వైద్య సిబ్బంది పలుసార్లు పరీక్షలు చేస్తున్నారు. ఆ సమయంలోనే వారికి బిడ్డ, తల్లి ఆరోగ్యంపై అవగాహన వస్తుంది. కొంతమంది తీవ్ర ఇబ్బంది పడుతున్నా.. సాధారణ ప్రసవం కోసం వేచి చూడమని అంటున్నారని వాపోయారు. అవసరాన్నిబట్టి శస్త్రచికిత్స చేస్తే వారి ప్రాణాలు దక్కేవి కదా అని బాధితులు పేర్కొంటున్నారు. కొందరు సిబ్బంది తీరుతోనే ఇబ్బందులు వస్తున్నాయని అంటున్నారు.

ప్రాణాలు కాపాడడం మా బాధ్యత

గతంలో జరిగిన ఘటనలు అన్నింటిల్లో వైద్యుల నిర్లక్ష్యం లేదు. ఒక ఘటనలో మాత్రం సమయానికి అందుబాటులో లేని పిల్లల వైద్యుడిపై పరిపాలనాధికారి చర్యలు తీసుకున్నారు. రోజు రాత్రి, పగలు అని కాకుండా 20కి పైగా ప్రసవాలు చేస్తుంటాం. ప్రజల ప్రాణాలు కాపాడడం మా బాధ్యత. కొన్ని ప్రతికూల పరిస్థితుల్లో అలాంటివి జరుగుతుంటాయి.

డాక్టర్ నవీన, ఆర్.ఎం

ఏప్రిల్ 24న

మంచిర్యాలకు చెందిన శిరీషను కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. ఆమెకు వైద్యులు ప్రసవం చేశారు. పుట్టిన పసికందు రెండ్రోజులు బాగానే ఉంది. ఆ తర్వాత జ్వరం రాగా పిల్లల వైద్యుడి వద్దకు వెళ్లగా, ఆయన అందుబాటులో లేరు. ఆ తర్వాత శిశువు మరణించాడు. సమయానికి వైద్యం అందక మృతి చెందాడని కుటుంబ సభ్యుల ఆందోళన చేశారు.

మే 2 :చొప్పదండి మండలం భూపాలపట్నంకు చెందిన శ్వేతకు పుట్టిన బాబు కొద్ది గంటలలోనే కన్నుమూశాడు. ఆ కుటుంబం ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతుంది.

12నకరీంనగర్‌కు చెందిన నీషా తప్రీన్(26) ఆసుపత్రికి రాగా బిడ్డకు జన్మనిచ్చిన కొద్ది సమయంలోనే ప్రాణాలు విడిచింది. ఈ సంఘటనతో కుటుంబమంతా రోదించింది. 15నహర్షిత అనే మహిళ ప్రసవంలోనే బాబు మృతి చెందడం ఆ కుటుంబాన్ని కన్నీటిపర్యంతం చేసింది.

# పరికరాలు కరవు.. అవస్థలు తీరవు!

ధర్మపురి: ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలకు కావాల్సిన పరికరాలు ఏమాత్రం అందుబాటులో లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా సేవలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. గతఏడాది 30 పడకల ఈ ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్‌లోకి మార్చారు. మొత్తం ఎనిమిది మంది వైద్యులను జిల్లా కేంద్రం నుంచి డిప్యుటేషన్‌పై ఇక్కడికి కేటాయించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రతిరోజు 125 మందితో ఓపీ నమోదవుతోంది. ఇప్పుడిప్పుడే ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో నమ్మకం కలుగుతున్నా రోగుల పరీక్షలకు కావాల్సిన పరికరాలేవీ అందుబాటులోకి రాలేదు. రోగులకు ఎక్స్‌రే, ఇతర పరీక్షలకు స్కానింగ్ సదుపాయం అందుబాటులో లేదు. వార్డు సిబ్బందిని సైతం నియమించాల్సి ఉంది.

రక్తపరీక్షలు చేసి జగిత్యాల టీహబ్‌కు పంపిస్తున్నారు. ఫలితాల కోసం రెండురోజుల పాటు ఎదురు చూడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఆసుపత్రిలో ప్లేట్‌లెట్ కౌంటింగ్ మిషన్‌ను ఏర్పాటు చేసినా, నిర్వహణ లేక అది మూలనపడింది.

డయాలసిస్‌పై అవగాహన ఏదీ?

ధర్మపురిలోని ఆసుపత్రిలో డయాలసిస్ సేవలను ఫిబ్రవరి నెల నుంచి ప్రారంభించారు. కేవలం ఏడుగురు మాత్రమే ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. ధర్మపురితోపాటు చుట్టుపక్కల మండలాల్లో ఆయా



సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉండగా దానిని చేపట్టడం లేదు. ఈ కారణంగా తక్కువ సంఖ్యలో రోగులు తమ పేర్లు నమోదు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల డయాలసిస్ కేంద్రంలో జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. రోగులు కరీంనగర్‌కు వెళ్లకుండా ఇక్కడే సేవలు పొందే వీలుంది. దీనిపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రతిపాదనలు పంపించాం

ధర్మపురిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరికరాల ఏర్పాటునకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరవగానే ఏర్పాటు చేస్తాం. డయాలసిస్ సేవలపై స్థానికులకు అవగాహన కల్పించాం. విద్యుత్తు అంతరాయం ఏర్పడినా సేవలకు ఇబ్బంది లేకుండా జనరేటర్‌ను ఏర్పాటు చేశాం. డయాలసిస్ సేవలను పొందేందుకు చాలామంది దరఖాస్తు చేసుకున్నా నిబంధనల ప్రకారం ఏడుగురు మాత్రమే అర్హులుండటంతో వారికి సేవలందిస్తున్నాం.నవీన్, ఆసుపత్రి సూపరింటెండెంట్, ధర్మపురి

# బూడిద రవాణాకు ఎన్టీపీసీ టెండరు

గోదావరిఖని : రామగుండం ఎన్టీపీసీ భారీ ఎత్తున బూడిద రవాణాకు టెండర్లు ఆహ్వానించింది. రెండు నెలల క్రితమే 1.70 లక్షల మెట్రిక్ టన్నుల బూడిద రవాణాకు టెండర్లు ఖరారు చేసింది. 40 లక్షల మెట్రిక్ టన్నుల రవాణాకు టెండర్లు ఆహ్వానించగా మొత్తం 1.70 లక్షల మెట్రిక్ టన్నులకు మాత్రమే బిడ్‌లు దాఖలు చేశారు. ప్రస్తుతం మిగిలిపోయిన 38,28,500 మెట్రిక్ టన్నుల బూడిద రవాణాకు ఆసక్తి ఉన్న వారి నుంచి బిడ్స్ ఆహ్వానిస్తుంది. దీనికి సంబంధించిన టెండరు దాఖలు షెడ్యూలును విడుదల చేసింది. రెండు నెలల క్రితం కేటాయించిన బూడిద రవాణా టెండరులో మెట్రిక్ టన్నుకు రూ.395 చొప్పున ఖరారు చేయగా తాజాగా రూ.69గా నిర్ణయిస్తూ షెడ్యూలు విడుదల చేసింది. కొత్తగా ఆహ్వానించిన టెండరు లో ధర తక్కువకే బూడిద రవాణాకు బిడ్స్ ఆహ్వానించిన ఎన్టీపీసీ సంస్థ ఎంఎస్‌టీసీ ద్వారా టెండరు దాఖలు చేయాలని సూచించింది. కుందనపల్లి పాండు నుంచి రవాణా చేసుకోవడానికి ఏడాది కాలానికి ఆహ్వానించిన టెండర్లలో గతంలో ఎక్కువ ధరకు కోడ్ చేసిన ఎన్టీపీసీ ఈసారి తక్కువ ధరతో ఆహ్వానించడంతో ఎక్కువ మంది పాల్గొనే అవకాశం ఉంది. రెండు నెలల వ్యవధిలోనే భారీ తేడాతో టెండర్లు ఆహ్వానించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా సకాలంలో రవాణా చేయాల్సిన బూడిద లక్ష్యాన్ని పూర్తి చేయని గుత్తేదార్ల విషయంలో యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇటుక ధరలు తగ్గేనా?బూడిద ధర పెరగడంతో సిమెంటు ఇటుక బట్టీల యజమానులు 40 శాతం ధర పెంచారు. దీనివల్ల వినియోగదా రులపై భారం పెరిగింది. ప్రస్తుతం ఎన్టీపీసీ యాజమాన్యం సైతం బూడిద రవాణా చేసుకోవడానికి



ధర తగ్గించడంతో పెంచిన ఇటు ధరలు సైతం తగ్గించాలని వినియోగదారులు కోరుతున్నారు. కేవలం రూ.69కే మెట్రిక్ టన్ను బూడిద రవాణా చేసుకోవడానికి ఎన్టీపీసీ యాజమాన్యం అవకాశం కల్పించింది. దీంతో ఇటుక ధరలు తగ్గుతాయని వినియోగదారులు భావిస్తున్నారు.

# ఆమని.. ఆర్థిక శక్తి

భువనగిరి : 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయ సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.515 కోట్ల రాయితీ రుణాలుగా అందించేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కిరాణం, జనరల్ స్టోర్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, దుస్తుల విక్రయ కేంద్రం, వ్యవసాయం, పాడి పశువులు, మేకల పెంపకం తదితర జీవనోపాధికి అవసరమైన యూనిట్లు నెలకొల్పేందుకు మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. సంబంధిత గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రోత్సహించడంతో పాటు తీసుకున్న రుణాలు ఏవిధంగా పెట్టుబడికి వియోగించుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. బ్యాంకు రుణాల సద్వినియోగంపై అధికారులు చైతన్యం తీసుకురావడంతో నెలవారీ వాయిదాలు సక్రమంగా చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరం మహిళా సంఘాలకు లక్ష్యాలను అధికారులు ఖరారు చేశారు. స్వయం ఉపాధిరుణాలు పొందడంతో పాటు రుణాలు సకాలంలో తిరిగి చెల్లించేలా ఏపీఎం, సీసీ స్థాయి అధికారులు మహిళా సంఘాల సభ్యులు పలు దఫాలుగా స్థానిక వెలుగు కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్నారు.

బ్యాంకులు సైతం సుముఖంఏటా బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాలు నిర్దేశించిన లక్ష్యం మేరకు అందిస్తున్నందున మహిళల్లో ఆర్థిక భరోసా ఏర్పడుతోంది. కిస్తులు సకాలంలో చెల్లిస్తుండటంతో బ్యాంకు అధికారులు సైతం మహిళా సంఘాల సభ్యులకు రుణాలు అందించేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు.

# సర్దుబాట..

కొత్తగూడెం : విద్యాశాఖలో పాఠశాలల స్థాయి కార్యక్రమాల అమలులో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు (సీఆర్పీ) ప్రధాన భూమిక పోషిస్తున్నారు. కాంప్లెక్స్ పరిధిలో హెచ్.ఎం. ఆదేశాల అమలుపై పర్యవేక్షణ, పాఠశాలల సందర్శన, బడిబయట పిల్లల గుర్తింపు, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరు పరిశీలన.. ఇలా వివిధ బాధ్యతలు వారివే. ఎస్ఎంసీలు, ప్రధానోపాధ్యాయుల సమావేశాల నివేదికలు రూపొందించడం మరో ప్రధాన విధి. మొత్తంగా విద్యా సంబంధ కార్యక్రమాల అమలులో ప్రేరకులుగా వ్యవహరించాలి. ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో పదుల సంఖ్యలో పాఠశాలలుంటాయి. ఇంత ప్రాముఖ్యంగల సీఆర్పీల పోస్టులు జిల్లావ్యాప్తంగా పలుచోట్ల ఖాళీ ఉన్నాయి. మరికొన్నిచోట్ల అదనపు పోస్టులున్నాయి. వారు లేనిచోట్ల కాంప్లెక్స్ హెచ్.ఎం.లకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో వేసవి సెలవుల్లోనే సీఆర్పీల సర్దుబాటుకు ఆ శాఖ శ్రీకారం చుట్టింది.

సీనియారిటీయే ప్రాతిపదిక

అదనంగా ఉన్నవారిని లేనిచోట్ల సర్దుబాటు చేయడానికి విద్యాశాఖ ఉన్నతాధికారులు తాజాగా ఆదేశాలు వెలువరించారు. జిల్లా అధికారులు కార్యాచరణ అమలుకు విధివిధానాలు రూపొందించారు. సీనియారిటీ ప్రకారం ఇతర చోట్లకు సీఆర్పీలను పంపడానికి నివేదిక తయారు చేసి కలెక్టర్ అనుదీప్‌కు నివేదించారు. ఆయన్నుంచి




అనుమతులు రాగానే సర్దుబాటు ప్రక్రియ ప్రారంభమవుతుంది. జిల్లాలో మొత్తం 90 స్కూల్ కాంప్లెక్స్‌లున్నాయి. వీటిల్లో 80చోట్ల 101 మంది సీఆర్పీలు పనిచేస్తున్నారు.

పదిచోట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంకోపక్క పాల్వంచ-3, అశ్వారావుపేట-2, దమ్మపేట-2, దుమ్ముగూడెం-2, అశ్వాపురం-1, మణుగూరులో ఒకరు సహా మొత్తం 11మంది అదనంగా పనిచేస్తున్నారు. ఆళ్లపల్లి, చంద్రుగొండ, భద్రాచలం, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి, ములకలపల్లి, పాల్వంచలో ఒక్కో సీఆర్పీని నియమించాలి. ఇల్లెందులో ముగ్గురు అవసరం. "విద్యాశాఖ పథకాల అమలులో సీఆర్పీలది కీలక పాత్ర. జిల్లాలో వివిధ కాంప్లెక్స్‌ల పరిధిలో వీరి స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని కలెక్టర్ ఆదేశాల మేరకు సర్దుబాటు చేస్తాం. హెచ్.ఎం.తోపాటు సీఆర్పీలు పనిచేయడం ప్రతి కాంప్లెక్స్‌కూ తప్పనిసరి చేస్తున్నాం." సోమశేఖర్‌శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

# సర్కారు బడికి ఆధునిక సొబగులు

పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి శ్రీ యోజన(స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా పథకం)కు శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ స్థాయిలో విద్యను బోధించడమే ఈ పథకం లక్ష్యం. ముందుగా పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, తరగతి గదులు, కంప్యూటర్లు, బెంచీలు తదితర కనీస వసతుల వివరాలపై ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో అత్యధికంగా విద్యార్థుల సంఖ్య, వసతులు ఉన్న పాఠశాలలకు మార్కులు కేటాయించారు. పేద విద్యార్థులకు ఇప్పుడున్న వసతులకు తోడు అధునాతన సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారు. జిల్లాలో ఈ పథకం కింద తొలిసారిగా 11 పాఠశాలల కు అవకాశం దక్కింది. నాలుగేళ్లలో రూ.1.52 కోట్లతో వీటిని అభివృద్ధి చేయనున్నారు. తద్వారా సర్కారు బడుల రూపురేఖలు మారనున్నాయి.

కార్పొరేట్ స్థాయిలో వసతులు

పీఎం శ్రీ కింద ఎంపికైన పాఠశాలలను 2023-24 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల పాటు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తారు. విద్యార్థులకు అధునాతన వసతులు, ప్రయోగశాల, డిజిటల్ గ్రంథాలయం, అంతర్జాల కనెక్షన్, వృత్తి విద్యా కోర్సులు, క్రీడా సామగ్రి, సౌర విద్యుత్తు అందించనున్నారు. విద్యార్థులు తాగేందుకు శుద్ధ జలం, పోషకాహార తోట పెంపకం, ప్లాస్టిక్ రహితంగా మార్చడం వంటి వసతులు సమకూర్చనున్నారు. ప్రతి ఏటా రూ.38 లక్షల చొప్పున కేటాయించనున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందనుంది.



ఎక్కడెక్కడ అమలు చేస్తారంటే..

రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' కింద పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం కూడా కొత్తగా పీఎం శ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద జిల్లాలో సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి ప్రాథమిక పాఠశాల, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, రామగుండం ఆదర్శ పాఠశాలలు, ధర్మారం మండలం మల్లాపూర్, మంథని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, పెద్దపల్లి మండలం అప్పన్నపేట, మంథని మండలం వెక్లాస్‌పూర్, కమాన్‌పూర్, ఓదెల మండలం పొత్కపల్లి, రామగుండంలలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయి.

తనిఖీ చేసి.. మార్కులు కేటాయించి

కేంద్ర ప్రభుత్వం వినూత్నంగా అమలు చేస్తున్న ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న పాఠశాలల్లో క్షేత్ర స్థాయిలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. విద్యా శాఖ నిబంధనల ప్రకారం ప్రధానోపాధ్యాయులు నమోదు చేసిన నివేదికలపై ఆరా తీశారు. గ్రామీణ పాఠశాలలకు 60 మార్కులు, పట్టణ ప్రాంతాల బడులకు 70 మార్కులను ఎంపికలో కొలమానంగా తీసుకున్నారు. విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతుల నమోదులో వాస్తవికతను పరిశీలించారు. ఈ వివరాలను రాష్ట్ర స్థాయిలో సమగ్రంగా నివేదించారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యజిల్లాలో పీఎం శ్రీ యోజనకు ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడనున్నాయి. పథకం కింద ఏటా నిధులు కేటాయించనుం డటంతో అధునాతన వసతులు అందుబాటులోకి వస్తాయి. సర్కారు పాఠశాలల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందనుంది. శ్రీనివాస్, సమగ్ర శిక్ష జిల్లా సమన్వయకర్త

# అన్నీ మంచి రోజులే..



మణుగూరు : పెళ్లంటే నూరేళ్ల పంట. రెండు జంటల కలయిక. రెండు కుటుంబాల అనుబంధం. వీటిన్నింటితోపాటు విభిన్న వృత్తుల వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే వేడుక క్రతువు. ప్రతీ ఏడాది సాధారణంగా మే, జూన్ నెలల్లో ఎక్కువగా మంచి ముహూర్తాలుంటాయి. ఎప్పటిలాగే ఈసారి కూడా మే, జూన్ మధ్య వరకు వరుసగా శుభ ఘడియలున్నాయి. ఈ ముహూర్తాలను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు వివాహాలు చేయడానికి, గృహ ప్రవేశాలకు, ఇతర శుభకార్యాలకు ముందుగానే ముహూర్తాలను నిర్ణయించుకున్నారు. జూన్ 18 నుంచి ఆగస్టు 18 వరకు శుక్రమూఢమి కారణంగా వివాహాలకు వీలులేదు. అందుకనే వీలున్న ముహూర్తాల్లోనే శుభకార్యాలు జరిపించడానికి తొందర పడుతున్నారు.

వేదికలకు ముందస్తు బుకింగ్‌లే..

జిల్లా వ్యాప్తంగా ఇదివరకే ఖరారైన వివాహాలకు తగినట్లుగా వేదికలను బుక్ చేసుకున్నారు. ఫంక్షన్ హాళ్లలో పెళ్లిళ్లు చేసేందుకు కొందరికి వసతి లభించని పరిస్థితి. ఇవి దొరకని వారు దేవాలయాలు, ఇళ్ల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్వ ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరా, కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరులో వంద పైచిలుకు ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. ఇవే కాకుండా ప్రతి మండలంలోనూ ఒకటి రెండు ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. ఇవన్నీ దాదాపుగా ప్రస్తుతమున్న ముహూర్తాలకు బుక్ అయ్యాయి.

ఉపాధి లభిస్తోంది..

ఈసారి అధిక సంఖ్యలో ముహూర్తాలు ఉండటంతో వివాహాది శుభకార్యాలపై ఆధారపడి ఉపాధి పొందుతున్న వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టెంట్‌హౌస్, డెకరేషన్ వ్యాపారులు, పురోహితులు, బ్యాండ్, కేటరింగ్, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఇలా పలు రంగాలకు చెందిన వారు ఈ రెండు నెలలు అస్సలు ఖాళీలేనంతగా పని లభిస్తోందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమైన తేదీలు..

మే: 20, 21, 26, 27, 28, 30, 31.

జూన్: 1, 3, 5, 7, 8, 9, 10, 11, 14.

"ఈ నెల నుంచి జూన్ 14వరకు మంచి ముహూర్తాలున్నాయి. దీంతో ఎన్నో వివాహాలు, ఇతర శుభకార్యాలు ఖాయం చేసుకున్నారు. ఈ సమయాన్ని పలు రంగాల వారు సద్వినియోగం చేసుకోవడం వలన అధిక ఆదాయాన్ని పొందవచ్చు."రామానుజాచారి, పురోహితుడు, మణుగూరు.

# పశుగ్రాసానికి కొరత..



జనగామ : జిల్లాలో పశు గ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతోంది. రికార్డు స్థాయిలో వరి సాగు జరిగినా అకాల వర్షాల కారణంగా కొరత ఉత్పన్నమైంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న రెండు లక్షలకు పైగా పశువులు ఎండు పశుగ్రాసం కోసం పాట్లు పడుతున్నాయి. యాసంగి సీజన్‌లో కోతకు వచ్చిన దానితో పశుగ్రాసాన్ని అన్నదాతలు ఆరు నెలల పాటు నిల్వ చేసుకుంటారు. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 1.91 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. జనగామ, బచ్చన్నపేట, నర్మెట్ట, తరిగొప్పుల, రఘునాథపల్లి, లింగాలగణపురం మండలాల్లో వడగళ్లు, అకాల వర్షాలు ముంచెత్తడంతో వరి ధాన్యంతోపాటు పశు గ్రాసం సైతం చేతికి రాకుండా పోయింది. జిల్లాలో 50వేల ఎకరాల్లో పంటల నష్టం వాటిల్లిందని అధికారులు వెల్లడించారు. ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన అకాల వర్షాల కారణంగా కొన్ని చోట్ల గడ్డి పోచ మిగులకుండా చేయగా, మరికొన్ని ప్రాంతాల్లో వడగళ్లతో గడ్డి చేతికందకుండా పోయింది. వర్షపు నీటిలో మురిగిపోయి వ్యర్థంగా మారి కోతలకు వీలుకాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ రంగంతోపాటు వేలాది మంది రైతులు పాడి రంగాన్ని సైతం ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారు.

గడ్డి పోచ మిగలలే - బింగి కృష్ణ, గానుగుపహాడ్, జనగామ మండలం


మూడు ఎకరాల్లో వరి సాగు చేశా. కోత దశకు వచ్చాక వడగళ్ల వానలతో గింజ చేతికి రాకుండా పోగా, గడ్డి పోచ మిగలలే. మాకున్న రెండు పశువులకు మేత లేకుండా పోయింది. వర్షాకాలం పశువులకు ఎండు గడ్డి లేకుండా పోయింది. గడ్డిని కొనుగోలు చేద్దామన్నా.. చుట్టుపక్కల దొరికే పరిస్థితి లేదు.

గడ్డి విత్తనాలు అందిస్తాం

-వై.నర్సయ్య, పశు సంవర్ధక శాఖ ఏడీ, జనగామ

వడగళ్ల, అకాల వర్షాలతో వరి పంట పూర్తిగా దెబ్బతినడంతో పశు గ్రాసానికి సైతం ఇబ్బందులు ఏర్పడినట్లు మా దృష్టికి వచ్చింది. పశు గ్రాసం కొరత ఏర్పడిన రైతులకు గడ్డి విత్తనాలు అందించేందుందకు సిద్ధంగా ఉన్నాం. బోరు, బావి ద్వారా నీటి వసతి కల్గిన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

# యథేచ్ఛగా ఆక్రమణలు



మెట్‌పల్లి : ఓ వైపు ప్రభుత్వం హరితహారం పేరిట మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తుండగా.. మరోవైపు కొందరు అటవీ భూముల ఆక్రమణకు యత్నిస్తున్నారు. కొత్తగా ఆక్రమణలు చేసే భూములకు పోడు హక్కులు కల్పిస్తారనే అవగాహన రాహిత్యంతో అటవీ ప్రాంతాన్ని చదును చేసే పనులు తరచూ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. మెట్‌పల్లి మండలం రంగారావుపేట బీట్ కంపార్ట్‌మెంట్ 611/13 పరిధిలో సుమారు 600 ఎకరాలకు పైగా అటవీ భూమి విస్తరించి ఉంది. రంగారావుపేట, ఆత్మకూర్, రామలచ్చక్కపేట, జగ్గాసాగర్, కేసీఆర్ తండా, పాటిమీదితండా, మెట్లచిట్టాపూర్, అల్లూరి సీతారామరాజుతండా, ఆత్మనగర్ తదితర గ్రామాల శివారులో అటవీ భూమి ఉంది. కొందరు అవకాశం దొరికినప్పుడల్లా గుట్టుగా వృక్షాలు, ముళ్లపొదలు తొలగిస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం అటవీ భూముల్లో పోడు సాగు చేస్తున్న వారికి హక్కు పత్రాలు ఇస్తామని ప్రకటించింది. దీంతో తమకు కూడా హక్కులను ఇస్తారనే అపోహతో కొందరు గత అక్టోబర్‌లో కొత్తగా అటవీ ప్రాంతాన్ని కొంత మేర చదును చేసే యత్నం చేశారు. పలు గ్రామాలకు చెందిన వారు అటవీ ప్రాంతాన్ని పోటాపోటీగా ఆక్రమించుకోవాలని చూశారు. ఆ సమయంలో సిబ్బంది, పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేసి అటవీ భూముల్లోకి ఎవరూ వెళ్లకుండా చూశారు. కొందరిపై కేసులు నమోదు చేశామని అధికారులు పేర్కొన్నారు. ఇటీవల మళ్లీ అటవీ భూముల చదునుకు యత్నిస్తున్నారు. యంత్రంతో రాత్రివేళ అటవీ భూమిని చదును చేస్తున్నారనే సమాచారంతో సిబ్బంది వెళ్లగా గమనించి వెళ్లిపోయారు. దీనిపై అటవీశాఖ అధికారులు కొందరిపై కేసు నమోదు చేశారు. నిఘా పెంచి అటవీ సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పోడు లబ్ధిదారులు లేరు

ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం 2005 సంవత్సరానికి ముందు నుంచే పోడు భూములు కలిగి ఉన్న వారికి మాత్రమే హక్కులను కల్పించే అవకాశం ఉంది. పోడు హక్కుల కోసం 309 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి విచారణ తర్వాత నిబంధనల ప్రకారం మెట్‌పల్లి పరిధిలో లబ్ధిదారులు ఎవరూ లేరని అధికారులు తేల్చారు. ఇదిలా ఉంటే పోడు హక్కుదారులు ఎవరూ లేరని తేలడంతో ఇప్పటికే ఆక్రమణలో ఉన్న అటవీ భూములను కూడా సంరక్షించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అధికారులు నిఘా పెంచాలి

జరుపుల శ్రీనివాస్, ఆత్మనగర్ సర్పంచి ..ప్రభుత్వం 2005 కంటే ముందు పోడు భూములు ఉన్న వారికి హక్కులు ఇస్తామని ప్రకటించింది. కానీ పోడు హక్కులు కల్పిస్తారని కొందరు కొత్తగా అటవీ భూముల ఆక్రమణకు యత్నిస్తున్నారు. యంత్రాలతో వృక్షాలు, పిచ్చిమొక్కలు తొలగించి చదును చేసేందుకు చూస్తున్నారు. ప్రభుత్వం హరితహారంలో మొక్కలు పెంచి పచ్చదనం పెంపునకు కృషి చేస్తుంటే అటవీని చదును చేయడం సరికాదు. అధికారులు నిఘా పెంచి అటవీ సంపదను కాపాడాలి.

కేసులు నమోదు :

షౌకత్‌అలీ, మెట్‌పల్లి ఎఫ్ఆర్వో..రంగారావుపేట బీట్ పరిధిలో అటవీ భూముల సంరక్షణపై నిఘా పెంచుతున్నాం. గత అక్టోబర్‌లో చదునుకు యత్నించిన వారిపై కేసులు నమోదు చేశాం. ఇటీవల అటవీ భూముల్లోకి ఓ యంత్రం వెళ్లిందనే సమాచారంతో అక్కడికి వెళ్లేసరికి వారు వెళ్లిపోయారు. కొందరిపై కేసు నమోదు చేసి పికెటింగ్ ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు ఎలాంటి ఆక్రమణ జరగలేదు. ఈ భూముల్లో ప్లాంటేషన్ పెట్టి మిశ్రమ జాతి మొక్కలు పెంచేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం.

# 'క్రమబద్ధీకరణ'కు వెనకడుగు

భూపాలపల్లి : తెలంగాణ ప్రభుత్వ అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించేందుకు 2019లో ఎల్ఆర్ఎస్‌కు అవకాశం కల్పించడంతో చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా ఈ ప్రక్రియ చేపట్టేందుకు సర్కారు ముందుకొచ్చింది. నెల రోజులైనా డబ్బులు చెల్లించేందుకు దరఖాస్తుదారులు ముందుకురావడం లేదు. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) కింద వచ్చిన దరఖాస్తులను భూపాలపల్లి పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక సిబ్బంది పరిశీలిస్తున్నారు. వీరిలో కొందరికి ఫోన్ చేయగా అనుమతి తీసుకొని భవనం నిర్మించుకున్నామని, ఇప్పుడు ఎల్ఆర్ఎస్ అవసరం లేదని సమాధానం చెబుతున్నారు. దరఖాస్తులో పేర్కొన్న చరవాణి నంబర్లు కొన్ని పనిచేయడం లేదు. నాన్ లే అవుట్ ప్లాటు కొనుగోలు చేస్తే దానికి ఎల్ఆర్ఎస్ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా.. ఇక్కడ అదేదీ లేకుండానే ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. భవన నిర్మాణ అనుమతిచ్చే ముందు ఎల్ఆర్ఎస్ లేకపోవడంతో అదనంగా ఫీజు చెల్లించి మరీ అనుమతులు తీసుకుంటున్నారు. ఈ రెండు అవసరాలు తీరిపోవడంతో ప్రస్తుతం దరఖాస్తుదారులు ఎవరూ



ముందుకు రావడం లేదు.

మొదట్లోనే ఇచ్చినట్లయితే..

ఎల్ఆర్ఎస్‌కు ప్రభుత్వం 2019లో ఒకసారి, 2020లో రెండో సారి అవకాశం ఇచ్చింది. రూ.1000 చెల్లించిన వారు 3,510 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి అప్పట్లోనే క్రమబద్ధీకరణ చేస్తే మిగతా ఫీజు చెల్లించేవారు. ఆ ప్లాటు రిజిస్ట్రేషన్ పత్రాల్లో పేర్కొన్న భూమి విలువలో 14 శాతం ఇప్పుడు క్రమబద్ధీకరణ కోసం చెల్లించాలి. అదేవిధంగా ప్రతి గజానికి రూ.100 కట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం రూ.వెయ్యి చెల్లించిన వారికే ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దరఖాస్తు చేసిన వెంటనే ఎల్ఆర్ఎస్ జారీ చేసేందుకు సర్కారు అనుమతివ్వలేదు. మొదట్లోనే అనుమతి ఇస్తే, పురపాలక సంఘానికి మరింత ఆదాయం సమకూరేది.

ఎవరూ ముందుకు రావడం లేదు..

- పి.సునిల్, టౌన్ ప్లానింగ్ అధికారి

ఎల్ఆర్ఎస్ కావాలని ఎవరైనా ముందుకు వస్తే, వారి ఇంటి స్థలాన్ని క్రమబద్ధీకరణ చేస్తూ ధ్రువీకరణ పత్రం ఇస్తాం. ఇదివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎల్ఆర్ఎస్ చేసుకోవాలని సూచిస్తున్నాం. ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటివరకు ఒక్క ఎల్ఆర్ఎస్ అయినా జారీ చేయలేదు.

# ఔరా.. కొత్త ఎత్తుగడ

నల్గొండ : జిల్లాకేంద్రం ప్రకాశంబజారులో పేరుప్రఖ్యాతలు గల ఓ వ్యాపారి ఆయన. స్థలాల క్రమబద్ధీకరణలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయనకు పట్టణంలో సుమారు రూ.2 కోట్ల విలువైన భవనం ఉంది. ఆ వ్యాపారికి అద్దె రూపంలో రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. జిల్లాలోనే స్వచ్ఛంద సంస్థల సేవల ద్వారా అందరికీ సుపరిచితుడైన వ్యాపారి కూడా ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయ పన్ను చెల్లిస్తున్నారు. ఇలా ఒకరు కాదు ఇద్దరూ కాదు ప్రకాశం బజారులో ఉన్న 234 మంది వ్యాపారుల్లో 180 మందికిపైగా వ్యాపారులు రూ.లక్షల్లో వ్యాపారం నిర్వహిస్తున్న వారే. వీరందరి గురించి ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనడుస్తోంది. ఎందుకంటే.. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన మెమోలో వీరందరిని పెట్టి వెండర్స్ (చిరువ్యాపారులు) గా గుర్తించారు. స్థానిక సంస్థలకు చెందిన స్థలాలను జీవో 58, 59 కింద క్రమబద్ధీకరించే అవకాశం లేకపోవడంతో నల్గొండ వ్యాపారులు కొత్త ఎత్తుగడ వేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో లోపాయికారిగా వ్యాపారులు కుమ్మక్కైనట్లు ప్రచారం సాగుతోంది. ఈ తతంగం వెనుక పెద్ద ఎత్తున డబ్బులు కూడా మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంకేముంది బడా వ్యాపారులు కాగితాల్లో చిరు వ్యాపారులుగా మారిపోయారు. ఆర్థికంగా వెనుకబడి, వీధివ్యాపారులుగా జీవన మనుగడ సాగిస్తున్న వారికి ప్రభుత్వ స్థలాలు బహిరంగ మార్కెటు ధరలకు విక్రయించే అవకాశం ఉండటంతో




దీనిని ఆసరాగా చేసుకున్న నల్గొండ ప్రకాశంబజారు, వస్త్రలతబజారు బడా వ్యాపారులు సైతం చిరువ్యాపారుల ముసుగు కప్పుకుని సుమారు రూ.200 కోట్ల విలువైన మున్సిపాలిటీ స్థలాలను రూ.18 కోట్లకే దక్కించుకునేందుకు పావులు కదిపారు.

మెప్మా జాబితాలో ఏరి? రూ.లక్షల వ్యాపారాలు సాగిస్తున్న లక్షాధికారులను ఏ ప్రతిపాదికన చిరు వ్యాపారులుగా ఎలా గుర్తించారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రంలో సుమారు 12వేల మందికిపైగా ప్రభుత్వం చిరువ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు కూడా జారీ చేసింది. పైగా ఆర్థికంగా బలోపేతం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వానిధి పథకం ద్వారా మూడు విడతలుగా రూ.10వేల నుంచి రూ.50వేల వరకు రుణాలు మంజూరు చేశారు. కానీ ఆ జాబితాల్లో ప్రకాశంబజారు వ్యాపారుల పేర్లు మాత్రం లేవు. నిజమైన చిరు వ్యాపారులైతే ప్రభుత్వం గుర్తించిన జాబితాల్లో ఉండాలి. వాస్తవానికి వారంతా ధనవంతు లే...వారికి ఏ ప్రతిపాదికన మున్సిపల్ స్థలాలు కట్టబెడుతున్నారో అధికారులు ప్రజలకు సమాధానం చెపాల్సిన అవసరం ఉంది. ఇదే అంశంపై కొంత మంది కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

# అందదు పత్రం.. నిరీక్షణలో నేత్రం

నిర్మల్ : హాజీపూర్ మండలం వేంపల్లిలోని ఓ అద్దె ఇంటిలో ఏర్పాటుచేసిన జిల్లా రవాణాశాఖ కార్యాలయం సమస్యలకు నిలయంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులకు సక్రమంగా సేవలు అందడం లేదు. సరైన పత్రాలు లేవనే సాకుతో వాహనాలకు భారీ ఎత్తున జరిమానాలు విధిస్తున్న అధికారులు ఆ పత్రాలను మాత్రం సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వాహనదారులు పత్రాలు పొందేందుకు నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది.

నిర్లక్ష్యంతో అందని సేవలు...జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వాహనదారులు డ్రైవింగు లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌పత్రాల వంటివి పొందేందుకు ఉదయం ఎనిమిది గంటలకు కార్యాలయానికి చేరుకొని వరుసలో నిల్చుంటే సాయంత్రం వరకు కూడా పనులు పూర్తికావడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. ఒక్కోసారి అన్ని పత్రాలున్నప్పటికీ వాటిని పరిశీలించి ఏదో ఒక కొర్రి పెట్టి పనిని మరోరోజుకు వాయిదా వేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పోస్టింగ్ మంచిర్యాల.. విధులు ఆదిలాబాద్‌లో..

జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో నియమితులైన ముగ్గురు



ఎంవీఐలలో ఇద్దరిని ఆదిలాబాద్‌కు డిప్యుటేషన్‌పై పంపడం స్థానికంగా తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. నిత్యం రద్దీగా ఉండే మంచిర్యాలలో నియమితులైన అధికారులు సంబంధిత పోస్టులు లేని ప్రాంతానికి డిప్యుటేషన్ వేయించుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలపై పర్యవేక్షణ కరవైంది.

జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఇద్దరు పర్యవేక్షకులు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. సదరు ఉద్యోగి నిత్యం వరంగల్ నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో వాహనదారులకు ఇబ్బందులు పెరిగాయి. ఐదుగురు క్లర్కులకు కేవలం ఒక్కరే ఉన్నారు. ఆ ఉద్యోగి నిత్యం కరీంనగర్ నుంచి వస్తూ పోతుంటారు. రోజుకు సుమారుగా రూ.2 లక్షల మేరకు ఆదాయం సమకూర్చుకునే కార్యాలయంలో సిబ్బంది నిర్లక్ష్యం శాపంగా మారుతోంది.

డ్రైవింగు లైసెన్సులు, రెన్యూవల్స్, నూతన వాహనాల రిజిస్ట్రేషన్లు, వాహనాల ట్రాన్స్‌ఫర్లు, ఫిట్‌నెస్‌లు సకాలంలో పూర్తికాక వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. పత్రాల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. కార్యాలయంలో సరైన తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యం, కుర్చీలు తదితర వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు మహిళలు పేర్కొంటున్నారు. వాహనదారుల దరఖాస్తులు పరిశీలన, ఫొటోలు తీయడం, వేలిముద్రలు తీసుకోవడం, వాహనదారులకు డ్రైవింగ్‌లైసెన్సు పరీక్షలు చేసే పనులను హోంగార్డులు, అటెండర్లచేత చేయించి కాలం వెల్లబుచ్చుతున్నారు.

సేవలు అందేలా చర్యలు – కిష్టయ్య, జిల్లా రవాణాశాఖ అధికారి, మంచిర్యాలవాహనదారులకు సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటు న్నాం. పలుమార్లు సిబ్బంది కొరత కారణంగా కార్యాలయంలో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నాం.

# పెంపు తక్కువ.. అవసరం ఎక్కువ




ఆదిలాబాద్ : జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఖరారైంది. గతేడాదితో పోలిస్తే మరో 8 శాతం పెంచి దీన్ని విడుదల చేశారు. ఏటా రుణ లక్ష్యం భారీగా ప్రకటిస్తున్నా.. పంటరుణాల మంజూరుకు బ్యాంకులు ఆంక్షలు పెడుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది లక్ష్యం రూ.1988.63 కోట్లు కాగా, వానాకాలం, యాసంగి సీజన్లలో కలిపి రూ.1032.12 కోట్లు మాత్రమే రైతులకు ఇచ్చారు. ఈ సీజన్‌లో పంట రుణాలు రూ.2163.14 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రైతుబంధు బకాయిలకే జమ..

జిల్లాలో 1.50 లక్షల మంది రైతులు ఉన్నారు. రైతుబంధు పథకం కింద ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తున్నా.. ఎంతో కొంత పంట రుణం తీసుకోవాల్సి వస్తోంది. సకాలంలో బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం, రుణమాఫీ వస్తుందనే ఆశతో చాలామంది ఇచ్చిన రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో అనేక మందిపై వడ్డీ భారం పడింది. బ్యాంకులు పుస్తక సర్దుబాటు చేస్తున్నాయి. గత ఏడాది తీసుకున్న రుణం చెల్లించినట్లుగా చూపి.. తిరిగి కొంత మొత్తం పెంచి కొత్తగా ఈ సీజన్‌కు రుణం ఇచ్చినట్లుగా చూపుతున్నారు. బ్యాంకులు ఇచ్చే రుణం కాగితాలకే పరిమితం కావడంతో పెట్టుబడికి రైతులు తిరిగి దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. గత ఏడాది ప్రభుత్వం జమ చేసిన రైతుబంధు సాయం కొన్ని బ్యాంకులు పాత బకాయిల కింద జమ చేసుకున్నాయి. ఈ సీజన్‌లో అదే పరిస్థితి ఉండనుంది.

కౌలు రైతుల ఊసే లేదు

జిల్లాలో అనేక మంది కౌలు రైతులు ఉన్నారు.. గతంలో రుణ అర్హత కార్డులు ఇచ్చి వారికి పంట రుణాలు మంజూరు చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం కౌలు రైతుల ప్రస్తావన చేయకపోవడంతో రుణప్రణాళికలో ప్రత్యేకంగా కేటాయింపులు చేయలేదు. వీరితో పాటు అటవీహక్కు పత్రాలున్న రైతులకు, ఏజెన్సీ ఏరియాలో సాగు చేసే ఇతర రైతులకు పట్టాలున్నా రుణాలు మంజూరు చేయడం లేదు.

కేటాయింపులు ఇలా..జిల్లాలో ప్రభుత్వం అమలు చేసే పలు పథకాలు, రాయితీలు, సాగు విస్తీర్ణం, పంట సాగుకయ్యే పెట్టుబడి, తదితరాలను దృష్టిలో పెట్టుకున్న బ్యాంకులు ఈ ఏడాది రూ.4211.14 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను ఖరారు చేశాయి. బ్యాంకుల వారీగా ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు విడివిడిగా రుణ లక్ష్యాలను కేటాయించారు.

ఏ రంగానికి ఎంత శాతం..వ్యవసాయరంగంలో ఖర్చులు భారీగా పెరిగినా.. బ్యాంకులు ఇచ్చే రుణాల మొత్తం తక్కువే ఉంటోంది. ఎకరాకు రూ.40 వేలకు మించి ఇవ్వడం లేదు. ఒక్కో రైతుకు రూ.2 లక్షలకు మించి రుణం ఇవ్వరు. బ్యాంకుల వారీగా రుణాల లక్ష్యాన్ని నిర్దేశించినా.. సకాలంలో ఇవ్వడంపై బ్యాంకులు శ్రద్ధ చూపడం లేదు. ఇటీవల విడుదల చేసిన వార్షిక రుణ ప్రణాళికను గత ఏడాదితో పోలిస్తే కేవలం 8 శాతం పెంచారు. వ్యవసాయ, అనుబంధ రంగాలపై దీర్ఘకాలిక రుణాలు ఇచ్చేందుకు మరో 6 శాతం అదనంగా నిధులు కేటాయించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఇచ్చే రుణాల శాతం పెంచగా, ఇళ్లకు సంబంధించిన రుణాలు తగ్గించారు.

# కొత్తగా.. కొంగొత్తగా..!




నిర్మల్ : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా టికెట్టు ధరలు పెంచాల్సిన పరిస్థితి, దీంతో ప్రయాణికుల నుంచి విమర్శలు.. గట్టి పోటీతో ఇబ్బందిపెడుతున్న ప్రైవేటు రవాణా.. వెరసి ఆర్టీసీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వ్యక్తిగత వాహన వినియోగమూ ఎక్కువవుతున్న తరుణంలో సంస్థను బలోపేతం చేసేందుకు, ప్రయాణికులను ఆకర్షించేందుకు సంస్థ కొంగొత్త ఆలోచనలకు రూపమిస్తోంది. మారుతున్న పరిస్థితులు, ఆలోచనలకు అనుగుణంగా కార్యాచరణకు సన్నద్ధమవుతోంది. ఆదిలాబాద్ జిల్లా రీజియన్ పరిధిలో ఇలాంటి చర్యలకు ప్రణాళిక సిద్ధం చేశారు.

పర్యాటక ప్రాంతాలను కలిపేలా..ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పర్యాటకులను ఆకర్షించే ప్రాంతాలకు కొదువ లేదు. దేశంలోనే సుప్రసిద్ధమైన బాసర సరస్వతి ఆలయంతో పాటు నిర్మల్ కొయ్యబొమ్మలు, ఇక్కడి పురాతన కట్టడాలు, కడెం ప్రాజెక్టు, కుంటాల, పొచ్చర జలపాతాలు, అటవీ అందాలు, కాల్వ, కదిలి లాంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను ప్రజలు సందర్శించేందుకు అనువుగా చర్యలు చేపడ్తున్నారు. నిర్మల్, కడెం, పోచంపాడ్ ప్రాంతాలను ఒక ప్యాకేజీలో, బాసర, అలీసాగర్, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న సహస్రకుండ్ ప్రాంతాలు మరో ప్యాకేజీలో.. ఇలా విభిన్న తరహాలో ఆలోచనలు సిద్ధం చేస్తున్నారు. టూరిజం తరహాలో హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రజల ఆసక్తి, అభిరుచికి అనుగుణంగా మార్పులు, చేర్పులు చేపట్టనున్నారు.

కార్గోలో.. కొయ్యబొమ్మలు

నిర్మల్ కొయ్యబొమ్మలు విశేష గుర్తింపు పొందాయి. ఆసక్తిగల ప్రజలకు వీటిని నేరుగా అందించేందుకు కార్గో సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే కొయ్యబొమ్మల పారిశ్రామిక సహకారసంఘం నిర్వాహకులతో సంప్రదింపులు చేపట్టారు. దీనివల్ల అందుబాటులో ఉన్న ఆర్టీసీ కార్గో కేంద్రాలను సంప్రదించి తమకు కావాల్సిన బొమ్మలను ఉన్న చోట నుంచే ఆర్డర్ చేసుకునే అవకాశం కలుగుతుంది. మున్ముందు ఆర్టీసీ ఆన్‌లైన్‌లోనూ కొయ్యబొమ్మలను ప్రదర్శనకు ఉంచి, కోరుకున్నవారికి విక్రయించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

విద్యాసంస్థల్లో రహదారి భద్రత క్లబ్బులు..

పాఠశాలలు, కళాశాలల్లో ఆర్టీసీ ఆధ్వర్యంలో రహదారి భద్రత క్లబ్బులు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. విద్యార్థులందరినీ ఇందులో భాగస్వాములను చేస్తారు. రహదారి ప్రమాదాలకు గల కారణాలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్గిస్తారు. వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తారు. 5కె, 10 కె నడక పోటీలు చేపడ్తారు. ఫలితంగా చదువుకుంటున్న సమయంలోనే రోడ్డు నిబంధనలను తెలుసుకొని ఆచరించేందుకు అవకాశం ఏర్పడుతుంది. అదే సమయంలో.. వారి కుటుంబసభ్యులను, ఇరుగుపొరుగును చైతన్యపరిచే బాధ్యతను విద్యార్థులు పంచుకుంటారు. జిల్లా పాలనాధికారి, జిల్లా పోలీసుశాఖ అధికారుల సమన్వయంతో క్లబ్బుల ఏర్పాటు చేయనున్నారు.

ఆదాయం పెంచుకునేలా.. – సుధాపరిమళ, ఆర్ఎం, ఆదిలాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ పరిధిలో ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు వీలుగా వివిధ ప్రణాళికలతో ముందుకెళ్తున్నాం. ఇందులో భాగంగా పర్యాటకానికి ఊతమిచ్చేలా, ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేలా టూరిజం ప్యాకేజీలను సిద్ధం చేస్తున్నాం. బస్ ఆన్ కాంటాక్ట్ పేరిట ప్రజలు కోరుకున్న చోటకు వెళ్లేందుకు ప్రత్యేకంగా బస్సులు కేటాయిస్తున్నాం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలను ఆకర్షించే అనేక పుణ్యక్షేత్రాలు, ప్రకృతి అందాలు, పురాతన కట్టడాలున్నాయి. వీటిని మరింత చేరువచేసేలా రవాణ సౌకర్యం కల్పించాలన్నది మా లక్ష్యం. అదే సమయంలో సామాజిక బాధ్యతగా ప్రమాదాల నివారణ కోసం విద్యార్థుల్లో చైతన్యం పెంచేలా రోడ్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అందరూ సహకరిస్తే సంస్థ అభివృద్ధి, లాభాల బాటలో పయనిస్తుంది.

# పేర్లు మాయం.. కష్టాల మయం

తాండూరు : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించి బాధ్యతలు రాష్ట్రం నుంచి కేంద్రం చేతుల్లోకి బదిలీ అవడంతో సాఫ్ట్‌వేర్ కూడా మారిపోయింది. కానీ కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. కొన్నింటిలో లబ్ధిదారుల పేర్లు మాయమవగా.. మరి కొన్ని భత్యాలకు సంబంధించిన ఆప్షన్లు కనుమరుగయ్యాయి. వేతనాలు సరిగ్గా అందడం లేదు. దీంతో ఉపాధి కూలీలతో పాటు, పథకం ద్వారా వరి కల్లాలు నిర్మించుకున్న లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. ప్రతి ఏడాది ఒక్కో జాబ్‌కార్డుకు 100 రోజుల పని దినాలు కల్పించాలి. చేసిన పనికి కూలీ వేతనంతో పాటు భత్యాల రూపంలో 30 శాతం వరకు అదనంగా అందించేవారు.

ఫిబ్రవరి చివరిలో మారిన సాఫ్ట్‌వేర్..రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పథకం ఉన్నప్పుడు రాగస్ అనే సాఫ్ట్‌వేర్‌ను వినియోగించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పథకం కేంద్ర ప్రభుత్వం కిందకు వెళ్లగా వారు ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నారు.

కానరాని ఆప్షన్లు..ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశానికి తీసుకెళ్లే పరికరాలు, నీటి వసతి, ఎండ నుంచి కాపాడుకునేందుకు టెంట్ల ఏర్పాటు, ప్రథమ చికిత్స పెట్టె తీసుకెళ్లిన వారికి కొంత మొత్తంలో భత్యాలను అందజేసేది. కానీ రాష్ట్రం నుంచి కేంద్రానికి సాఫ్ట్‌వేర్ బదిలీ అయ్యాక ఈ ఆప్షన్లు ఏవీ కానరావడం లేదు. దీంతో ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మేలో 30శాతం, జూన్‌లో 20 శాతం భత్యాలను కూలీలు కోల్పోయారు. ఈ లెక్కన ఒక్కో కూలీ సుమారు రూ.3000లను నష్టపోయారు.

కనిపించని వరి కల్లాల వివరాలు..నిర్మాణాలు ఆలస్యమవడం, అంతలోనే సాఫ్ట్‌వేర్ మారిపోవడంతో కొంత మంది లబ్ధిదారుల వివరాలు ఉపాధిహామీ పథకం నుంచి గల్లంతయ్యాయి. అందులో మార్చి 31వ తేదీలోపు నిర్మాణం పూర్తికాకపోయిన వాటితో పాటు ఇన్‌ప్రోగ్రెస్‌లోనికి రానివి కనిపించడం లేదు. కానీ మార్చి తరువాత నిర్మాణం పూర్తి చేసుకున్న రైతుల పరిస్థితి మాత్ర ఆగమ్యగోచరంగా మారింది. కూలీలకు అందని వేతనాలు..నూతన సాఫ్ట్‌వేర్ వచ్చినప్పటి నుంచి కూలీలందరికీ వేతనాలు అందడం లేదు. గతంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతా కలిగిన కూలీలకు కూడా అందరితో పాటే వేతనం అందేది. కానీ ఇప్పుడు కేంద్ర పరిధిలోకి వెళ్లాక అకౌంట్స్ రిజెక్టు అవుతున్నాయి. దీంతో ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన వేతనాలు రాకపోవడంతో చాలా మంది కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారు. చిత్రంలో తాను నిర్మించుకున్న వరి కల్లాన్ని చూపిస్తున్న రైతు పేరు దుర్గం ధర్మయ్య. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన అతను 72 చదరపు మీటర్ల విస్తీర్ణంతో కల్లాన్ని నిర్మించుకున్నాడు. కానీ మార్చి 31లోపు నిర్మాణం పూర్తి కాకపోవడంతో పని సమాచారం ఇన్‌ప్రోగ్రెసివ్‌లోకి రాలేదు. ప్రస్తుతం మారిన సాఫ్ట్‌వేర్‌లో పనికి సంబంధించిన ఐడీ కూడా చూపించడం లేదు. అప్పుడేమో అధికారులు తొందరపెట్టి మరీ నిర్మించుకోవాలన్నారని.. తన పేరే కనిపించడం లేదని వాపోతున్నాడు.

# నిధులు రావాలి.. అభివృద్ధి పరుగెత్తాలి!

మెదక్ : స్వరాష్ట్రం ఏర్పడ్డాక పరిపాలనను మరింత సులభం చేసేందుకు.. అభివృద్ధి వేగంగా జరిగేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటుచేసింది. ఈ క్రమంలోనే జిల్లా పరిషత్‌లు సైతం కొలువుదీరాయి. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడంలో జడ్పీ కీలకపాత్ర పోషిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమలులో జడ్పీ సభ్యులు భాగస్వాములు అవుతారు. మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశాల్లో సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపేందుకు జడ్పీ వేదిక అవుతుంది. జడ్పీలు ఏర్పడి మూడేళ్లవుతున్న నేపథ్యంలో నిధుల కేటాయింపు, అభివృద్ధికి పడిన అడుగుల తీరుపై ప్రత్యేక కథనం.మెదక్ కేంద్రంగా 20 మండలాలతో తెరాస ప్రభుత్వం కొత్తగా జిల్లాను ఏర్పాటుచేసిన విషయం విదితమే. 2019లో తొలి అడుగు వేసి జిల్లా పరిషత్తును కొలువుదీర్చారు. అన్ని మండలాల్లో ఎన్నికలు నిర్వహించగా.. అత్యధిక జడ్పీ స్థానాలను తెరాస కైవసం చేసుకుంది. ఈ క్రమంలో 2019 జులై 5న జడ్పీ పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసింది. జడ్పీ ఏర్పడిన సమయంలో మొత్తం 20 మండలాలు ఉండగా.. ప్రస్తుతం అవి 21కి చేరాయి. కొత్తగా ఏర్పడిన మాసాయిపేట మండలానికి సంబంధించి ఎన్నికలు నిర్వహించలేదు. ఇక చిలప్‌చెడ్ జడ్పీటీసీ సభ్యులు రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది.

మొదట్లో అరకొరే..జడ్పీకి ఆరంభంలో నిధులు లేక నిస్తేజంగా మారింది. అప్పట్లో ఉమ్మడి జిల్లాకు కేటాయించిన నిధులతో కొన్ని నెలల పాటు నెట్టుకొచ్చారు. ఆ సమయంలో జడ్పీకి ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 3 శాతం, సాధారణ నిధి, సీవరేజ్ గ్రాంట్, పర్‌క్యాప్టా గ్రాంట్ ద్వారా నిధులు వచ్చేవి. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత వాటిని రద్దు చేయగా.. సాధారణ, 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులను కేటాయిస్తున్నారు. ప్రతి నెలా కేటాయించడంతో కాస్త ఊరట లభించింది. వీటితో జడ్పీటీసీ సభ్యులు పనులు కొనసాగించారు. ప్రస్తుతం ఆరునెలలకోసారి విడుదలవుతున్నాయి. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో ఒకే సారి పనులు చేపట్టేందుకు పరిపాలనా అనుమతి పొందుతున్నారు. జడ్పీతో పాటు ఆయా పద్దుల ద్వారా వచ్చిన నిధులతో గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి.

రూ.9.84 కోట్ల మేర..జిల్లా పరిషత్తు ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు రూ.18 కోట్లు కేటాయించారు. వీటితో 637 పనులు చేపట్టేందుకు ప్రతిపాదించారు. ఉమ్మడి జిల్లా పరిషత్తు విభజించక ముందు 205 పనులకు రూ.7.93 కోట్లు కేటాయించగా, ఇందులో అత్యధిక శాతం పనులు పూర్తయ్యాయి. మెదక్ కేంద్రంగా ఏర్పడిన జడ్పీకి ఇప్పటి వరకు రూ.9.84 కోట్లు విడుదలయ్యాయి. ఇది వరకు జడ్పీకి ఆయా పద్దుల ద్వారా నిధులు వచ్చేవి.

# అరకొర సిబ్బంది.. సూచనలు అందక ఇబ్బంది

సంగారెడ్డి : ఉద్యాన పంటల సాగుతో మెరుగైన ఫలితాలు ఉంటాయని, ప్రభుత్వం రైతులను ఉద్యాన పంటల సాగు దిశగా ప్రోత్సహిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా, సలహాలు, సూచనలు కరవయ్యాయి. అరకొర సిబ్బందితో ఉద్యాన శాఖ నెట్టుకొస్తుండగా రెండేళ్ల కిందట పొరుగు సేవల పద్ధతిలో పనిచేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బందిని సైతం తొలగించడం అన్నదాతలకు మరింత ఇబ్బందిగా మారింది. జిల్లాలో గుమ్మడిదల, సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, జహీరాబాద్, హత్నూర, మొగుడంపల్లి, కోహీర్ తదితర మండలాల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. తాము పండించిన పండ్లు, పూలు, కూరగాయలను జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో జరిగే సంతల్లో విక్రయిస్తుంటారు. ఇక్కడి నుంచే హైదరాబాద్‌కు తరలిస్తారు.

పొరుగు సేవల వారిని తొలగించడంతో..

పంటవిత్తు నాటగానే వరుణుడి కటాక్షానికి ఆకాశం వైపు చూడాలి..మొలకెత్తింది మొదలు పంటకు చీడపీడల నివారణకు పెట్టుబడి ఖర్చులు.. పంట కోతకొచ్చి ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేదాకా అన్నదాతలకు కష్టాలే. గిట్టుబాటు ధర దక్కితేనే



ఆరుగాలం శ్రమకు ఫలితం ఉంటుంది. మెరుగైన దిగుబడులు, గిట్టుబాటు ధర దక్కేలా రైతులను సరైన బాటలో నడిపించేది క్షేత్రస్థాయి సిబ్బందే. జిల్లాలో 27 మండలాలు ఉండగా శాశ్వత ఉద్యోగులతో కలిపి 12 మంది క్షేత్రస్థాయిలో అన్నదాతలకు సలహాలు, సూచనలు ఇచ్చేవారు. రెండేళ్ల కిందట పొరుగు సేవల సిబ్బందిని తొలగించడంతో ప్రస్తుతం శాశ్వత పద్ధతిలో పనిచేస్తున్న ఏడుగురు ఉద్యాన అధికారులు మాత్రమే మిగిలారు.

అన్నదాతలకు ఇక్కట్లే: అవసరమైన మేర ఉద్యాన శాఖలో సిబ్బంది లేకపోవడంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఒక్కో ఉద్యాన అధికారి ప్రస్తుతం మూడు, నాలుగు మండలాల బాధ్యతలు చూడాల్సి వస్తోంది. ఏ అధికారి ఎప్పుడు ఏ మండలంలో ఉంటారో తెలియక రైతులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఒక్కో మండలానికి ఒక్కో అధికారి ఉంటేనే రైతులకు సలహాలు, సూచనలు అందేందుకు వీలుంటుంది. ముఖ్యమంత్రి ఇటీవల చేసిన ప్రకటన వాస్తవ రూపం దాల్చితే ప్రయోజనముంటుంది.

ఇబ్బందులు లేకుండా చూస్తాంసునీత, ఉద్యాన, పట్టుపరిశ్రమ జిల్లా అధికారిసిబ్బంది కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమే. అందుబాటులో ఉన్న సిబ్బంది ద్వారా ఉద్యాన రైతులకు సేవలందిస్తున్నాం. సీజన్‌ల వారీగా డిమాండ్ ఉండే పంటలపై అవగాహన కల్పిస్తాం. మండలానికి ఓ ఉద్యాన అధికారి ఉంటే ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుంది.

# విస్తరిస్తేనేమి.. రద్దీ తగ్గదేమి!

గజ్వేల్ : గజ్వేల్–ప్రజ్ఞాపూర్ బల్దియాలో ట్రాఫిక్ కష్టాలు నిత్యకృత్యమయ్యాయి. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు రోడ్లపై వరకు సామగ్రిని పెడుతుండటంతో రోడ్లన్నీ ఇరుగ్గా మారుతున్నాయి. వివిధ అవసరాల కోసం పట్టణానికొస్తున్న ప్రజలు ట్రాఫిక్ కష్టాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పట్టణంలో ఇరుకు రోడ్లను విస్తరించినప్పటికీ కష్టాలు తప్పటం లేదు. కొనుగోలు దారులు వాహనాలపై వస్తూ రోడ్ల పక్కనే నిలుపుతుండటంతో రద్దీ సమస్య ఏర్పడుతోంది. నిలువరించాల్సిన బల్దియా, ట్రాఫిక్ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రద్దీ సమస్యతో బాటసారులు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. వారాంతపు సంతతోపాటు నిత్యం వివిధ పనులు నిమిత్తం వేలాది మంది పట్టణానికి వచ్చిపోతుంటారు. ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు నిలిపే స్థలమే లేకపోవటంతో కొనుగోలుదారులు ఆయా దుకాణాల వద్దనే నిలిపి కొనుగోళ్లకు దిగుతున్నారు. తమ వ్యాపారం బాగా సాగాలన్న ఆత్రుతతో వాణిజ్యదారులు సామగ్రిని సగానికిపైగా రోడ్లపైనే పెడుతున్నారు. గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ బల్దియాలో 50 వేల జనాభా ఉంది. మెదక్, సిద్దిపేట జిల్లాలకు వ్యాపారం, విద్య, ఉపాధి సంబంధించి అనుకూలంగా ఉన్న పట్టణం కావడంతో జనాల తాకిడి ఎక్కువైంది. బల్దియాలో రహదారులను విస్తరిస్తున్నారు. రూ.25 కోట్ల వ్యయంతో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ రోడ్డు విస్తరణ పూర్తయినా వాహనాల పార్కింగ్, దుకాణాల సామాన్లు పెట్టడంతో ట్రాఫిక్ సమస్య యథాతథంగా ఉంటోంది. పట్టణంలో పలు చోట్ల ఇనుప జాలీలు ఏర్పాటు చేసి దారులు మళ్లించటంతో ఆర్టీసీ బస్సులు, పెద్ద వాహనాలు సులువుగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గజ్వేల్ బస్టాండు నుంచి రామాయంపేట, దౌల్తాబాద్ వైపు వెళ్లే బస్సులు రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా కుడి వైపు ప్రయాణిస్తున్నాయి. ఇందిరాపార్కు నుంచి అంగడిబజార్ మీదుగా గమ్యాలకు చేరుతున్నాయి.

ఎందుకిలా..తూప్రాన్ రోడ్డులో రేకులు, ఇంటి నిర్మాణ ఉపకరణాలు, ఫర్నీచర్ దుకాణదారులు రోడ్లపైనే పెడుతున్నారు. వెల్డింగ్ పనులను రోడ్లపైనే చేపడుతున్నారు. పాత వాహనాలు అమ్మేవారు కూడా ట్రాఫిక్‌కు అడ్డుగా పెడుతున్నారు. బ్యాంకులు, మద్యం దుకాణాల వద్ద ద్విచక్ర వాహనాలు రాకపోకలకు అడ్డుగా ఉంటున్నాయి.

గస్తీ చేపట్టి.. చర్యలు తీసుకుంటాం– తిరుపతి, సీఐ ట్రాఫిక్ విభాగం, గజ్వేల్

రోడ్లపై సామగ్రి, వాహనాలు పెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు గస్తీ చేపడుతున్నాం. దుకాణదారులు వారి స్థలంలోనే సామగ్రి పెట్టుకోవాలి. అందుకు ఏర్పాటు చేసుకొని పట్టణంలో రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా సహకరించాలి. గజ్వేల్ బస్టాండు నుంచి వాహనాలకు ఎదురుగా కుడివైపు రోడ్డులో వెళుతున్న ఆర్టీసీ బస్సు

# వాలంటీర్ల వ్యవస్థ అంటే చంద్రబాబుకు కడుపుమంట: సీఎం జగన్



విజయవాడ: ప్రజలకు, ప్రజా ప్రభుత్వానికి మధ్య వారధులు, సంక్షేమ సారథులు వాలంటీర్లు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తూర్పున సూర్యుడు ఉదయించకముందే చిక్కటి చిరునవ్వులతో గుడ్ మార్నింగ్ చెప్పి ప్రతి అవ్వాతాతకు మంచి మనవడిగా, మనవరాలిగా, ప్రతి వితంతువుకు, వికలాంగుడికి చెల్లెమ్మ–అక్కలా, తమ్ముడు– అన్నలా ప్రతినెలా ఒకటో తారీఖున అక్షరాల 64 లక్షల మందికి ప్రభుత్వ పెన్షన్ అందిస్తున్నారని సీఎం అన్నారు. ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా వారికి వందనం చెబుతూ వరుసగా మూడో ఏడాది గ్రామ, వార్డు సచివాలుయాల పరిధిలో సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ఇచ్చే కార్యక్రమానికి సీఎం జగన్ శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీళ్లు మంచి సేవకులు, సైనికులు. పేదలకు సేవలు చేసేందుకు 2.66లక్షల మంది సైన్యమే వాలంటీర్ వ్యవస్థ. దాదాపు 25 సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపి?క చేస్తున్నారు” అని సీఎం ప్రశంసించారు. “కులం, మతం, వర్గం, రాజకీయపార్టీలు చూడకుండా అర్హత మాత్రమే ప్రమాణంగా తీసుకుని పథకాలు అమల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. జగనన్న పెట్టుకున్న నమ్మకం వాలంటీర్లు. దేశంలో ఎక్కడకు వెళ్లి చూసినా.. మునుపెన్నడూ చూడని విధంగా ప్రజలకు వాలంటీర్ల ద్వారా మేలు జరుగుతోంది. ఇలాంటి సారథులు, వారధులు దేశంలో ఎక్కడా లేరు. మంచి మనసుతో అనేక మార్పులు తీసుకు వస్తున్నాం. అనేక మార్పులకు సాక్ష్యాలు కూడా వాలంటీర్లే. రాష్ట్రంలో 90శాతం గడపలకు వెళ్లి.. జగనన్న పాలనలో మాదిరిగా ఇలా మీ ఇంటికి వచ్చి ఒకటో తారీఖునే పెన్షన్ ఇస్తున్నా ఇలాంటి వ్యవస్థ గత ప్రభుత్వంలో ఏనాడైనా చూశారా. అమ్మ ఒడి, ఆసరా, చేయూత, ఇళ్లపట్టాలు, రైతు భరోసా.. ఇలా అందించడాన్ని గత ప్రభుత్వంలో ఏనాడైనా చూశారా? అని అడిగే నైతికత మీకు మాత్రమే సొంతం” అని సీఎం అన్నారు.

“గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల అరాచకాలు చూశారు. వివక్ష, లంచాలు చూశాం. మన అందరి ప్రభుత్వం తీసుకు వచ్చిన తులసిమొక్కల్లాంటి వ్యవస్థే వాలంటీర్ల వ్యవస్థ. 25 పథకాలకు సంబంధిచిన బ్రాండ్ అంబాసిడర్లు వాలంటీర్లు. చేస్తున్న మంచిని చూసి, నవరత్నాల పాలనను చూసి, 2.10 లక్షల కోట్లు డీబీటీని చూసి గతంలో ఎప్పుడూ మంచిచేయని చరిత్ర ఉన్నవారు దుష్ప్రచారాలు చేస్తున్నారు. ఎల్లోమీడియా, సోషల్ మీడియాల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. పేదల ప్రభుత్వంమీద గిట్టని వారు తప్పుడు ప్రచారాలు, అబద్ధాలు చెప్తున్నారు. నిందలు వేస్తున్నారు” అని సీఎం మండిపడ్డారు. “5 కోట్ల ప్రజల ప్రతి గడపవద్దకూ వెళ్లి నిజాలు చెప్పగలిగే సత్యసారథులు మీరు. ప్రతి గడపకూ నేరుగా వాలంటీర్లే మనకున్న బలం. ప్రతి గడప వద్దకూ వెళ్లి.. ప్రతి అక్కను కూడా నీకు ఈ మంచి జరిగిందా? లేదా? అని నీతిగా, నిజాయితీగా అడగగలిగే నైతికత ఈ ప్రభుత్వానికి ఉంది. అది వాలంటీర్ల వల్లే సాధ్యపడింది. ఎక్కడా మంచే తప్ప, చెడు చేయలేదు. ఈ ప్రభుత్వం ఫిలాసఫీకి ప్రతిరూపం వాలంటీర్లు. ఈ ప్రభుత్వంలో వాలంటీర్లు చేస్తున్నది సేవ. ప్రభుత్వం ఉద్యోగం పరిధిలోకి వచ్చేది కాదు. ఇది వాలంటీర్ సేవ. ఇక్కడ పనిచేస్తున్న ఏ ఒక్కరూ కూడా ప్రభుత్వ ఉద్యోగులు కారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రతి వాలంటీర్ కూడా స్వచ్ఛందంగా మంచి చేయాలి అనే మనస్సు పెట్టి తపన, తాపత్రయంతో అడుగులు వేస్తున్న మంచి మనుషులు. కాబట్టి.. ఎవరైనా మీరు చేయాల్సిన పనికాదు.. అని ఎవరైనా అంటే.. గట్టిగా సమాధానం చెప్పాల్సిన పని ఉంది” అని సీఎం అన్నారు.

# పేదలపై జగన్ ప్రేమ ధృతరాష్ట్ర కౌగిలి లాంటిది: జడ శ్రావణ్‌కుమార్



అమరావతి: రాజధాని అమరావతి కోసం భూములిచ్చిన రైతులకు ప్లాట్లు అభివృద్ధి చేసి ఇవ్వకుండా ఆ ప్రాంతంలో రాజధానేతర వాసులకు ఇళ్ల స్థలాలు కేటాయించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఎక్కడిదని జై భీమ్ పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్ కుమార్ ప్రశ్నించారు. న్యాయ పోరాటం ఓ మార్గం మాత్రమేనని అక్కడ న్యాయం జరగకపోయినంత మాత్రాన ఉద్యమం ఆపకూడదని అమరావతి రైతులకు సూచించారు. అమరావతి రైతుల తరఫున జై భీమ్ పార్టీ రాష్ట్రవ్యాప్త పోరాటం చేస్తుందని ఆయన ప్రకటించారు. విజయవాడలో మీడియాతో జడ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్–5 జోన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల పట్టాలివ్వటాన్ని అడ్డుకుంటామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులు త్యాగం చేసి ఇచ్చిన భూమిని వేరే వారికి ఎలా ఇస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. సీఎం జగన్ అమరావతిని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆర్–5 జోన్ అంశంలో అమరావతి రైతులకు నిరాశ మిగిలిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదలపై జగన్ ప్రేమ ధృతరాష్ట్ర కౌగిలిలాంటిదని అభివర్ణించారు. నిజంగానే పేదలపై జగన్ సర్కార్‌కి ప్రేమ ఉందనుకుంటే అది పొరపాటేనని అన్నారు. “2014లో అమరావతి రాష్ట్ర రాజధాని అని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నపుడు.. మూడు పంటలు పండే భూములను రైతులు ఇచ్చారు. గత ప్రభుత్వం సీఆర్డీఏ ఒక యాక్టును తయారు చేసి రైతులకు భరోసా ఇస్తూ ఒప్పందం ప్రకారం భూములు తీసుకుంది. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు సీఆర్డీఏ ఒప్పందాలను తుంగలో తొక్కుతూ రైతులను మోసం చేసింది. భూములు ఇచ్చిన రైతులపై జగన్ ప్రభుత్వం లాఠీ ఝుళిపించింది. రైతులకు తెదేపా పేరును అంటగట్టి.. జగన్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇవ్వడమే రైతులు చేసిన పాపమా?” అని ఆయన ప్రశ్నించారు.




కాఠ్‌మాండూ : 59 ఏళ్ల వయస్సులో గుండెకు పేస్‌మేకర్‌తో అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలనుకున్న ఓ భారతీయ మహిళ ఆశలు మధ్యలోనే ఆవిరయ్యాయి. ఆరోగ్యం సహకరించక మధ్యలోనే ప్రాణాలు కోల్పోయారు. దాంతో పేస్‌మేకర్‌తో ఎవరెస్ట్‌ను అధిరోహించిన తొలి ఆసియా మహిళగా రికార్డు సాధించాలన్న ఆమె కల నెరవేరలేదు. సుజానే లియోపోల్డినా జీసస్ స్వదేశం భారత్. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోన్న ఆమెకు వైద్యులు పేస్‌మేకర్ అమర్చారు. అయితే, ఎవరెస్ట్ అధిరోహించాలని, పేస్‌మేకర్ ధరించి ఆ శిఖరాన్ని చేరుకున్న తొలి ఆసియా మహిళగా రికార్డు సాధించాలని ఆమె లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు తగ్గట్టే ప్రాణాలు లెక్కచేయకుండా సిద్ధమయ్యారు. అయితే బేస్‌క్యాంపు వద్ద సాధారణ అభ్యాసాల్లో ఆమె కనీసవేగాన్ని అందుకోలేక ఇబ్బంది పడటం, అలాగే అధిరోహణకు కష్టపడటం చూసిన సిబ్బంది.. ఇక ముందుకెళ్లొద్దని వారించారు. కానీ, వారి మాటలు వినేందుకు ఆమె నిరాకరించారు. తాను అన్నింటికి అనుమతులు తెచ్చుకున్నానని, వెనక్కి వెళ్లనని చెప్పేశారు. నిర్వాహకుల్లో ఒకరైన దెండి షేర్పా మాట్లాడుతూ.. ‘ఐదురోజుల క్రితమే ఆగిపోవాలని ఆమెను హెచ్చరించాం. కానీ, సుజానే మాత్రం ముందుకువెళ్లాలనే నిర్ణయించుకున్నారు. ముందుకు వెళ్లడానికి అవసరమైన కనీస ప్రమాణాలను అందుకోలేకపోయారు. 250 మీటర్ల దూరం చేరుకోవడానికి ఆమెకు ఐదు గంటలు పట్టింది. మామూలుగా అయితే క్లైంబర్లు ఆ దూరాన్ని 15 నుంచి 20 నిమిషాల్లో చేరుకుంటారు. మూడు ప్రయత్నాల్లోనూ ఆమె వెనకబడిపోయారు. బేస్‌క్యాంప్ నుంచి 5,800 మీటర్ల ఎత్తుకు చేరిన తర్వాత ఆమె ఆరోగ్యం సహకరిచడం లేదని గుర్తించి, బలవంతంగా ఆసుపత్రికి తరలించాం. నేపాల్‌లోని లుక్లా ప్రాంతంలోని ఆసుపత్రిలో చేర్పించాం’అని చెప్పారు. అయితే, ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. దీనిపై ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు నేపాల్ పర్యాటక విభాగం డైరెక్టర్ యువరాజ్ ఖటివాడా తెలిపారు. ఇక ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఎనిమిది మంది మృతి చెందినట్లు తెలిపారు.

# కుంగిపోతోన్న న్యూయార్క్.. కారణమిదే!



వాషింగ్టన్: ఎటుచూసినా ఆకాశహార్మ్యాలతో ప్రపంచ దేశాలను ఆకట్టుకునే న్యూయార్క్‌కు.. ఆ భవంతులే శాపంగా మారాయా? తాజాగా వెలువరించిన ఓ అధ్యయనంలో ఇదే విషయం వెల్లడైంది. ఇక్కడి బహుళ అంతస్తుల భవనాల బరువు.. నగరాన్ని కుంగిపోయేలా చేస్తోందని అధ్యయనం పేర్కొంది. అమెరికా జియాలాజికల్ సర్వే సంస్థ, యూనివర్సిటీ ఆఫ్ రోడ్ ఐలాండ్‌లోని జియాలజిస్టులు ఈ అధ్యయనాన్ని చేపట్టారు. దీనికి సంబంధించిన వివరాలు ‘ఎర్త్ ఫ్యూచర్ జర్నల్’లో ప్రచురితమయ్యాయి. పరిశోధకులు మొదటగా న్యూయార్క్ నగరాన్ని చతురస్రాకార గ్రిడ్‌లుగా విభజించారు. ఈ క్రమంలోనే దాదాపు పది లక్షలకుపైగా భవనాలు ఉన్నాయని తేల్చారు. వాటి బరువు దాదాపు 85 కోట్ల టన్నుల వరకు ఉంటుందని లెక్కగట్టారు. ఈ క్రమంలోనే నగరం ఏటా 1– 2 మిల్లీమీటర్ల మేర వేగంతో కుంగిపోతోన్నట్లు గుర్తించారు. నేల స్వభావం, ఉపగ్రహ సమాచారాన్ని విశ్లేషించి ఈ మేరకు నిర్ధారణకు వచ్చారు. అప్పటికీ.. రోడ్లు, కాలిబాటలు, వంతెనలు, రైల్వేలు, చదును ప్రదేశాల ప్రభావాన్ని లెక్కలోకి తీసుకోలేదు. లోయర్ మాన్‌హాటన్, బ్రూక్లిన్, క్వీన్స్ తదితర ప్రాంతాలు వేగంగా కుంగిపోతున్నట్లు అధ్యయనంలో తేలింది. ‘ఉత్తర అమెరికాలో అట్లాంటిక్ తీరం వెంబడి సముద్ర మట్టాల పెరుగుదల ప్రపంచ సగటుకన్నా 3 నుంచి 4 రెట్లు ఎక్కువగా ఉంది. దీంతో న్యూయార్క్ నగరంలోని 84 లక్షల జనాభాకు.. ముంపు ముప్పు పొంచి ఉంది’ అని యూఎస్‌జీఎస్‌కు చెందిన ప్రధాన పరిశోధకుడు, భూగర్భ శాస్త్రవేత్త టామ్ పార్సన్స్ పేర్కొన్నారు. తీరప్రాంతాలు, జలవనరుల వద్ద నిర్మించే ప్రతి భవనం.. భవిష్యత్తులో వరదలకు కారణమవుతుందని అవగాహన కల్పించడమే తమ అధ్యయన ఉద్దేశమని తెలిపారు. సముద్ర మట్టాల పెరుగుదల, వరద ముప్పు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూపొందించే కార్యాచరణకు తమ పరిశోధనల ఫలితాలు ఉపయోగపడతాయని పార్సన్స్ చెప్పారు.

# జగన్ మీద ఎగిరిపడ్డ ఆ నలుగురు ఎక్కడ...?



అమరావతి : వైసీపీలో ముసలం పుట్టించి ఏపీ అంతటా పొలిటికల్ హీట్ ని రగిలించిన ఆ నలుగురు ఎక్కడ అని ఇపుడు అతి పెద్ద ప్రశ్న అయితే పొలిటికల్ సర్కిల్స్ నుంచి వినిపిస్తోంది. ఆ నలుగురు ఎవరు అంటే నెల్లూరులోని సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డి కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి గుంటూరు జిల్లా తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి. మార్చి 23న ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ నలుగురు అధికార పార్టీకి దెబ్బేసి మరీ జై టీడీపీ అనిపించారు. ఆ దెబ్బలు వైసీపీకి దిమ్మతిరిగి బొమ్మ కనిపిస్తే ఏపీలో ఈ రోజు మాదే రేపూ మాదే అని టీడీపీ గట్టిగా సౌండ్ చేసింది. ఒక విధంగా వైసీపీ పరువు పోవడానికి ఆ నలుగురూ కారణం అని ఫ్యాన్ పార్టీ జనాలు అంతా విమర్శించారు. ఆ మీదట కొన్నాళ్ళ పాటు హడావుడి చేసిన ఆ నలుగురూ ఇపుడు ఫుల్ సైలెంట్ అయ్యారు. మ్యాటరేంటి అన్నదే అంతా చర్చించుకుంటున్న విషయం. ముందుగా పెద్దాయన ఆనం రామనారాయణరెడ్డిని తీసుకుంటే ఆయన ఈ మధ్య కొంత సందడి తగ్గించారనే అంటున్నారు. నిజానికి ఆనం కి నెల్లూరు జిల్లాలో రెండు మూడు సీట్లలో పట్టుంది. ఆయన ప్రస్తుతం వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్నా ఆత్మకూరు వైపు చూస్తున్నారు. అక్కడ ఆయన గతంలో గెలిచారు. దాంతో గట్టిగానే పట్టుంది. ఆయన్ని ఆత్మకూరు రావాలని పోటీ చేయమని ఏడాది కాలంగా అక్కడి జనాలు కోరుతున్నారు. ఇంతలో పార్టీ పెద్దాయనను సస్పెండ్ చేయడంతో సింపతీ ఒక్కసారిగా పెరిగింది. మొదట్లో హడావుడి చేసి ఏకంగా జగన్ మీదనే ఘాటు విమర్శలు చేసిన ఆనం ఇపుడు కొంత దూకుడు తగ్గించారు. కారణాలు అయితే తెలియడంలేదు అంతున్నారు. ఇదే జిల్లాలో శ్రీధర్ రెడ్డిని తీసుకుంటే ఆయన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచారు. ఏడాది క్రితం వరకూ ఆయన గ్రాఫ్ డౌన్ లో ఉండేది వైసీపీ ఎమ్మెల్యేగా జనంలోకి వెళ్తే నిలదీతలే తప్ప ఏమీ లేవు. అయితే ఆయన పార్టీ నుంచి సస్పెండ్ అయ్యాక మాత్రం ఒక్కసారిగా సింపతీ పెరిగింది. ప్రతీ వారి ఆయన్ని కలసి ఆల్ ది బెస్ట్ చెప్పారు. సోషల్ మీడియా కూడా ఫుల్ సపోర్ట్ ఇచ్చింది. మంచి పని చేశారు. వైసీపీని వీడి అని కూడా అన్నారు అంతా. మొదట్లో ఆయన ఇంటర్వ్యూలు ఇస్తూ వైసీపీని తెగనాడుతూ ఒక లెక్కలో అన్నట్లుగా ఉండేవారు. కానీ ఇపుడు మాత్రం ఆయన ఎందుకో సైలెంట్ అయ్యారు. ఈసారి నెల్లూరు రూరల్ లో గెలుపు ఖాయమని అనుకున్న శ్రీధర్ రెడ్డి మౌనం వహించడం ఎందుకు అన్న ప్రశ్న వస్తోంది. ఇక మేకపాటి చంద్రశేఖరరెడ్డి విషయానికి వస్తే నాలుగు సార్లు ఉదయగిరి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన కూడా వైసీపీలో ఉన్నపుడు జనాదరణకు దూరం అయ్యారు. ఏడు పదుల వయసులో ఉన్న పెద్దాయనను వైసీపీ సస్పెండ్ చేసింది అన్న సానుభూతి ఆయనకు బాగా వచ్చింది. దానికి తోడు ఆయన వీధి పోరాటాలు చేస్తూ మరీ వైసీపీని బజారున పడేశారు. అలా ఆయన జనంలో మంచి పేరు సంపాదించారు. కానీ కొన్నాళ్ళుగా ఆయన కూడా మౌనమే నా భాష అనడంతో ఉలుకూ పలుకూ లేకుండా పోయింది. ఇక ఉండవల్లి శ్రీదేవి విషయానికి వస్తే ఆమె ప్రెస్ మీట్ హైదరాబాద్ లో పెట్టి జగన్నే సవాల్ చేశారు జై అమరావతి అన్నారు. రైతుల పక్షాన పోరు అని పెద్ద డైలాగులే వల్లించారు. వైసీపీ పని అయిపోయింది అని చెప్పిన ఈ లేడీ ఫైర్ బ్రాండ్ కి తాడికొండలో ఉన్న వ్యతిరేకత అంతా పార్టీ సస్పెండ్ చేయడంతోనే పోయింది. ఆమెకి ఒక్కసారిగా సానుభూతిగా పెరిగింది. ఏ పార్టీ నుంచి పోటీ చేసినా గెలుస్తారు అని అంతా అనుకున్నటైం లో ఆమె ఒక్కసారిగా దూకుడు తగ్గించారు. దాంతో ఆమె ఊసు ఎక్కడా చర్చకు రావడంలేదు. మరి ఉండవల్లి ప్లాన్స్ ఏంటి ఆమె ఏమి చేయబోతున్నారు. ఆమె వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్ధిగా ఉంటారు అన్నది ఇపుడు సస్పెన్స్ గా ఉంది. ఏ పార్టీ అయినా ఆమె యాక్టివ్ గా ఉండాలి కదా అన్నదే ఇపుడు చర్చ. ఈ నలుగురూ ఉంటే చాలు విపక్షం కంటే బీజారెక్కించేలా వైసీపీని నిలదీస్తారు అని అంటుంటే ఫుల్ సైలెంట్ అయిపోయారు. దీని భావమేమిటి అన్నది వారే చెప్పాలేమో.




హైదరాబాద్: మాజీ మంత్రి మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ అవినాష్‌రెడ్డి నేడూ విచారణకు హాజరుకాలేదు. తన తల్లి శ్రీలక్ష్మి అనారోగ్య కారణాల దృష్ట్యా విచారణకు రాలేనని పేర్కొంటూ సీబీఐకు ఆయన లేఖ రాశారు. ఈ మేరకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చేందుకు ఎంపీ తరఫు న్యాయవాదులు సీబీఐ కార్యాలయానికి వెళ్లారు. తన తల్లికి గుండెపోటు రావడంతో ఆమెను పులివెందులలోని ఈసీ గంగిరెడ్డి ఆస్పత్రిలో చేర్చినట్లు లేఖలో అవినాష్ పేర్కొన్నారు. సీబీఐ విచారణకు అవినాష్‌రెడ్డి చివరి నిమిషంలో గైర్హాజరు కావడం వరుసగా ఇది రెండోసారి. ఈనెల 16న ఆయన విచారణకు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ ముందస్తు కార్యక్రమాలను కారణంగా చూపుతూ హైదరాబాద్ నుంచి కడప వెళ్లిపోయారు. దీంతో సీబీఐ బృందం కూడా అంతేవేగంగా కడప చేరుకోవడం.. అవినాష్‌రెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఈ నెల 19న(నేడు) విచారణకు రావాలంటూ డ్రైవర్‌కు నోటీస్ ఇవ్వడం ఉత్కంఠ రేపింది. తాజాగా విచారణ కోసం పులివెందుల నుంచి హైదరాబాద్ చేరుకున్న అవినాష్.. మళ్లీ చివరి నిమిషంలో సీబీఐకి లేఖ రాస్తూ తన తల్లి అనారోగ్య కారణాల రీత్యా విచారణకు రాలేనని పేర్కొన్నారు. అనంతరం తిరిగి ఆయన పులివెందులకు బయల్దేరారు.

**మార్గంమధ్యలో సమాచారం వచ్చింది: అవినాష్ తరఫు న్యాయవాది** : ఉదయం హైదరాబాద్‌లోని తన ఇంటి నుంచి సీబీఐ కార్యాలయానికి అవినాష్‌రెడ్డి బయల్దేరారని.. మార్గంమధ్యలో తల్లి ఆస్పత్రిలో చేరినట్లు సమాచారం వచ్చిందని ఆయన తరఫు న్యాయవాది మల్లారెడ్డి తెలిపారు. అవినాష్ తల్లి గుండెపోటుతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరినట్లు సమాచారం వచ్చిందని చెప్పారు. దీంతో వెంటనే ఆయన పులివెందుల బయల్దేరినట్లు తెలిపారు. దీనిపై సీబీఐకి లిఖిత పూర్వకంగా సమాచారం ఇస్తామని.. వాళ్లు తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఎలా ముందుకెళ్లాలనేది తాము ఆలోచిస్తామన్నారు. తండ్రి భాస్కర్‌రెడ్డి జైల్లో ఉన్నందున తల్లిని అవినాష్‌రెడ్డే చూసుకోవాల్సి ఉందని న్యాయవాది చెప్పారు.

# తల్లిని తరలిస్తున్న అంబులెన్స్ వెంట ఎంపీ అవినాష్

డోన్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తల్లిని కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఇవాళ తన తల్లి అనారోగ్యంగా ఉందంటూ సీబీఐ విచారణకు అవినాష్ రెడ్డి హాజరుకాలేకపోయిన విషయం తెలిసిందే. ఆయన తల్లికి గుండెపోటు రావడంతో పులివెందులలోని ఈసీ గంగిరెడ్డి ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం అవినాష్ తల్లిని ఈసీ గంగిరెడ్డి ఆస్పత్రి నుంచి అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తాజాగా విచారణ కోసం పులివెందుల నుంచి హైదరాబాద్ చేరుకున్న అవినాష్.. మళ్లీ చివరి నిమిషంలో సీబీఐకి లేఖ రాస్తూ తన తల్లి అనారోగ్య కారణాల రీత్యా విచారణకు రాలేనని పేర్కొన్నారు. అనంతరం తల్లి శ్రీలక్ష్మిని చూసేందుకు పులివెందుల బయలుదేరారు. ఈ క్రమంలో తాడిపత్రి మండలం చుక్కలూరు వద్దకు చేరుకోగానే శ్రీలక్ష్మి ప్రయాణిస్తున్న అంబులెన్స్ అవినాష్‌కు ఎదురైంది. వెంటనే వాహనం దిగిన అవినాష్.. తల్లిని చూశారు. ఆమె ప్రయాణిస్తున్న అంబులెన్స్ వెంట తిరిగి హైదరాబాద్ బయలుదేరారు.

# వారికి శిక్ష పడే వరకు వివేకా ఆత్మక్షోభిస్తుంది: మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి



అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేస్తారనే విషయం సీఎం జగన్‌మోహన్ రెడ్డి, భారతి, అవినాష్‌రెడ్డిలకు ముందే తెలుసని మాజీ మంత్రి, భాజపా నేత ఆదినారాయణరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... జగన్ కూడా బాబాయి హత్యలో అవినాష్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నారనే విషయం అర్థమవుతోందన్నారు. “చేసిన తప్పులను అంగీకరించి అవినాష్ సరెండర్ అవ్వాలి. వివేకా హత్య జరిగిన వెంటనే జగన్‌కు కూడా సమాచారం అందింది. అజయ కల్లాం కూడా తెల్లవారుజామున జగన్‌కు చెప్పిన విషయాన్ని వెల్లడించారు. హత్య చేస్తారని తెలిసే ముందుగా జగన్ ఆ నలుగురితో సమావేశం పెట్టారు. అన్నీ జగన్‌కు తెలిసే జరిగాయి. వివేకానందరెడ్డి హత్య కేసులో దోషులు తప్పించుకోలేరు. అవినాష్, జగన్, భారతికి తెలిసే హత్య జరిగింది. వాళ్లకు శిక్షపడే వరకు వివేకానందరెడ్డి ఆత్మ క్షోభిస్తుంది. అవినాష్‌రెడ్డి ఈరోజు విచారణకు హాజరవుతానని చెప్పి.. ఇప్పుడు తల్లి అనారోగ్యం పేరుతో కొత్త డ్రామాకు తెరతీశారు. సీబీఐ ఎదుట హాజరుకావాలని కోర్టు ఇప్పటికే స్పష్టంగా చెప్పింది. జగన్‌కు, భాజపాకు దగ్గర సంబంధాలు ఉన్నాయనేది అపోహ మాత్రమే. ఆయన మాటల గారడీతో రాష్ట్రం సర్వనాశం అయింది. అలాంటి వ్యక్తిని ఎవరూ వెనుకేసుకు రారు” అని ఆదినారాయణరెడ్డి ధ్వజమెత్తారు.

# ఆర్-5జోన్‌లో ఇళ్ల నిర్మాణం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు



అమరావతి: రాజధానిలో ఆర్–5జోన్‌లో ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. సీఆర్డీఏ పరిధిలోని ఆర్–5జోన్‌లో 47,017 ఇళ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించారు. రాజధాని పరిధిలో పేదలకు ఇచ్చే స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాల మేరకు గృహనిర్మాణశాఖ ఈ ప్రతిపాదనలు పంపినట్టు తెలుస్తోంది. వాస్తవానికి ఆర్–5 జోన్‌లో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 51,392 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ప్రస్తుతం 47,017 ఇళ్ల నిర్మాణానికి మాత్రమే ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. షీర్ వాల్ టెక్నాలజీ ఉపయోగించి సీఆర్డీఏ పరిధిలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం యోచన చేస్తోంది. ఇళ్ల పట్టాల పంపిణీ సమయంలోనే ఇంటి మంజూరు పత్రాలను కూడా లబ్ధిదారులకు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న ఇళ్ల స్థలాల సంఖ్య, ఇళ్ల నిర్మాణం కోసం పంపిన ప్రతిపాదనల సంఖ్యలో వ్యత్యాసం ఉండటంతో 4,375 మంది లబ్ధిదారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. మరో వైపు ఇళ్ల స్థలాల లే అవుట్ల అభివృద్ధికి సీఆర్డీఏ రూ.50 కోట్లు కేటాయించింది. ఇప్పటికే లే అవుట్‌ల అభివృద్ధి కోసం రూ.20కోట్లను యుద్ధ ప్రాతిపదికన సీఆర్డీఏ ఖర్చు చేసింది.

## ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్న ఊర్వశి

క్షణానికో రంగు మార్చే లక్షణాన్ని ఊసరవెల్లితో పోల్చేస్తాం. ఇదే తరహా క్వాలిటీస్ రంగుల మాయా ప్రపంచంలో కొందరికే సాధ్యం. అతికొద్ది మంది జాబితాలో ఉంది ఊర్వశి రౌతేలా. హేట్ స్టోరీ 4 బ్యూటీ నిరంతరం వేడెక్కించే ఫోటోషూట్లతో సంచలనంగా మారుతోంది. తాజాగా ఊర్వశి షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది. ఇందులో ఈ అమ్మడి రూపం పూర్తిగా మారిపోయింది. మేకప్ టూమచ్ గా డామినేట్ చేసిందని కామెంట్లు వినిపిస్తున్నాయి. నిజానికి ఇది ఎవరో కనిపెట్టడం అంత సులువేమీ కాదు. చూడగానే ఊర్వశి అని అనలేం. నిజానికి ఇదే ఫోటోషూట్లో కొన్ని భంగిమల్లో మాత్రమే ఊర్వశి ఒరిజినల్ రూపం కనిపిస్తోంది. ఇక ఇటీవల ఊర్వశి వేగంగా మారిన రూపం చూస్తుంటే షాక్ తగులుతోంది.



ఇంతకుముందు ముద్దుగా బొద్దుగా కనిపించిన ఈ బ్యూటీ ఐశ్వర్యారాయ్ సిస్టర్ లా మెరుపుతీగలా మారింది. తాజా లుక్ లో బ్లాక్ డిజైనర్ డ్రెస్ ధరించిన ఊర్వశి ఎంతో ప్రత్యేకంగా కనిపిస్తోంది. కానీ తన రూపాన్ని డామినేట్ చేసేంతగా మేకప్ ని అద్దిన విధానం విమర్శలను ఎదుర్కొంటోంది. ఇక కొంతకాలంగా ఊర్వశికి అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో ఊహించని రీతిలో ఇలా ప్రయోగాలకు శ్రీకారం చుడుతోందని విమర్శలొస్తున్నాయి. అయినా మరీ ఇంతగా ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్న ఊర్వశిని నమ్మేదెలా.. నమ్మి అవకాశమిచ్చేదెలా? అంటూ నిర్మాతలు వాపోతే సన్నివేశం ఎలా ఉంటుందో ఊహించండి! అంటూ కూడా సరదా కామెంట్లు చేస్తున్నారు యూత్. నియోజకవర్గంలో ఊర్వశి హంగామా హేట్ స్టోరి 4 .. గ్రేట్ గ్రాండ్ మస్తీ చిత్రాలతో మత్తెక్కించిన ఊర్వశి త్వరలోనే టాలీవుడ్ లో సందడి చేయబోతోంది. మోడలింగ్ .. బుల్లితెరను ఏలిన ఈ బ్యూటీ అందాల రాణిగా కిరీటం గెలుచుకున్న సంగతి తెలిసిందే. నిజానికి బన్ని నటించిన పుష్పలో ఐటమ్ నంబర్ చేస్తుందని ప్రచారమైనా కానీ అది కుదరలేదు. తాజా నివేదిక ప్రకారం.. బాలీవుడ్ ఐటమ్ బాంబర్ ఊర్వశి రౌతేలా నితిన్ హీరోగా నటిస్తున్న 'మాచర్ల నియోజకవర్గం'లో ట్రీటివ్వనుందని టాక్ ఉంది.

## అరరే.. 'ఖిలాడి' భామను పట్టించుకునే నాధుడే లేడా?

డింపుల్ హయాతి.. ఈ హాట్ బ్యూటీ గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. 2017లో విడుదలైన 'గల్ఫ్' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత యురేక దేవి 2 అభినేత్రి 2 సహా తదితరల చిత్రాల్లో నటించింది. కానీ ఇవేమి ఆమెకు సక్సెస్ ఇవ్వలేకపోయాయి. అలాంటి తరుణంలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా హరీష్ శంకర్ తెరకెక్కించిన 'గద్దలకొండ గణేష్'లో ఐటెం సాంగ్ చేసే అవకాశం వచ్చింది. ఈ అవకాశామే ఆమె కెరీర్ టర్న్ అయ్యేలా చేసింది. వరుణ్ తేజ్ తో కలిసి 'జర్ర జర్ర' అంటూ ఐటెం సాంగ్ తో యూట్యూబ్ ను ఓ ఊపు ఊపేసి కావాల్సినంత క్రేజ్ సొంతం చేసుకుంది. ఆపై బాలీవుడ్ కోలీవుడ్ టాలీవుడ్ లో ఒకేసారి మూడు సినిమాలను పట్టేసింది. అందులో ఒకటి 'అత్రంగి రే'.అక్షయ్ కుమార్ ధనుష్ సారా అలీఖాన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం గత ఏడాది ఓటీటీలో



విడుదలైంది. ఇందులో అక్షయ్ సోదరిగా ధనుష్ను ప్రేమించే యువతిగా డింపుల్ బాగానే అలరించింది. ఆ వెంటనే విశాల్ సరసన ఈమె చేసిన 'సామాన్యుడు' మాస్ మహారాజ్ రవితేజకు జోడీగా నటించిన 'ఖిలాడి' చిత్రాలు ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద ఘోరంగా బోల్తా పడ్డాయి. ముఖ్యంగా వీటిలో ఖిలాడిపై డింపుల్ ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఇందులో హద్దులు మీరి అందాలు కూడా ఆరబోసింది. కానీ ఏం లాభం.. భారీ అంచనాల నడుమ రిలీజ్ అయిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో పూర్తిగా విఫలం అయింది. వరసగా రెండు ఫ్లాపులు పడటంతో.. ఇప్పుడు డింపుల్ కు అవకాశాలే కరువయ్యాయి. దీంతో ఈ బ్యూటీ సోషల్ మీడియా వేదికగా అందాల ఆరబోతకు తెర లేపింది. ఎప్పటికప్పుడు హాట్ హాట్ ఫొటో షూట్లతో కుర్రాళ్ళకు నిద్ర పట్టకుండా చేస్తుంది. అయినప్పటికీ.. ఆఫర్లు మాత్రం రావడం లేదట. ఖిలాడి విడుదలై రెండు నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు డింపుల్ నుంచి ఒక్క కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్మెంట్ కూడా రాలేదు. దీంతో ఈ భామను పట్టించుకునే నాధుడే లేడంటూ ప్రచారం మొదలైంది. మరి డింపుల్ కు నిజంగానే అవకాశాలు రావడం లేదా..? లేక మంచి కథల కోసం వెయిట్ చేస్తుందా..? అన్నది తెలియాల్సి ఉంది.




## సమంత వార్నింగ్.. రష్మిక రియాక్షన్ తో క్లారిటీ!





నటి సమంత నిన్నటి రోజున ఓ స్వీట్ వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'నా మౌనం అజ్ఞానం అని.. నా సైలెన్స్ అన్నిటికి అంగీకరిస్తున్నానని.. నా దయని బలహీనత అని అనుకోకండి. దయాగుణానికి కూడా ఓ చివరి డేట్ ఉంటుంది. జస్ట్ చెప్తున్నాను అంతే' అంటూ ఓ ట్వీట్ చేసింది. ఈ ట్వీట్ ఇంటర్నెట్ ని షేక్ చేసింది. ఎప్పుడూ కూల్ గా ఉండే సమంత ఒక్కసారిగా ఇలా లేచింది? ఏంటి అంటూ అంతటా చర్చకొచ్చింది. ఈ ట్వీట్ ఎవర్ని ఉద్దేశించి పెట్టినట్లు? సోషల్ మీడియా జనాల్నా? లేక తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ మాజీ గురించా? అంటూ కొన్ని రకాల ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. అయితే ఈ ట్వీట్ ని నేషనల్ క్రష్ బ్యూటీ రష్మిక మందన్న లైక్ చేసింది. పవర ఎమోజీతో పదం అంటూ తన ట్వీట్ కి రియాక్షన్ ఇచ్చింది. ఇలా సమంతకు మద్దతిచ్చిన ఏకైక మహిళా సెలబ్రిటీల కూడా రష్మిక కావడం విశేషం. చాలా మంది మహిళలు ఈ ట్వీట్ పై పాజిటివ్ గా స్పందించారు కానీ రష్మిక పవర్ ఎమోజీని జోడించడం చర్చకొస్తుంది. సోషల్ జనాలు రష్మిక గతాన్ని తవ్వడం మొదలు పెట్టారు. రష్మిక మందన్న ని కన్నడ ఇండస్ట్రీకి తీసుకొచ్చి హీరోయిన్ ని చేసింది రక్షిత్ శెట్టి. ఆ తర్వాత అతనితోనే రష్మి క ప్రేమలో పడింది. పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఎంగేజ్ మెంట్ కూడా చేసుకున్నారు. పెళ్లి ముహూర్తం కూడా ఫిక్స్ చేయడానికి రెడీ అవుతున్నారు. ఇంతలో ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయని విడిపోతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంలో రష్మికదే తప్పంతా అని నెటి జనులు తీవ్ర స్థాయిలో విమర్శించారు. పెద్ద హీరోయిన్ అయ్యే సరికి రష్మిక కి- రక్షిత్ శెట్టి నచ్చలేదా? అంటూ కామెంట్లు పోస్ట్ చేసారు. భారీ ఎత్తున ట్రోల్ చేసారు. కానీ వీటిని రష్మిక లైట్ తీసుకుంది. అలాగే సమంత కూడా చైతన్యతో విడిపోయిన తర్వాత ఇలాగే విమర్శలకు గురైంది. ఈ నేపథ్యంలో ట్రోలర్స్ ని ఉద్దేశించే సమంత అలా వార్నింగ్ ఇచ్చిందని..దానికి రష్మిక పవర్ అని రియాక్షన్ ఇచ్చినట్లు గుస గుస వినిపిస్తుంది. కాగా సమంత ట్వీట్ పై ఆమె అభిమానులు మద్దతుగా నిలిచారు. మీరు ఏదో ఒక రోజు మాట్లాడాలని కోరుకుంటున్నాం. నిజం చెప్పి అందరి నోళ్లు మూయించాలి. మీరు బలమైన నిర్ణయాలతో ముందుకు సాగుతున్నారు. ప్రతీ రోజు మీరు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా అని పోస్ట్ పెట్టారు. వారికి కావాల్సింది మీ దృష్టి మాత్రమే. దయచేసి ఆ ఛాన్స్ ఇవ్వకండి. వారు మీ దృష్టికి అనర్హులు. వాటిని పట్టించుకోకండి అని రాసుకొచ్చారు.

## పూల్ సైడ్ వాటర్ బేబీస్ తుంటరి వేషాలు







నార్త్ సౌత్ అనే విభేధం లేకుండా అన్నిచోట్లా వేవ్స్ క్రియేట్ చేస్తున్న నలుగురు ముద్దుగుమ్మలు కుర్రకారుకు సమ్మర్ ట్రీట్ ఇచ్చేందుకు రెడీ గా ఉన్నారు. వాటర్ బేబీస్ గా పూల్ సైడ్ ట్రీట్ తో కళ్లు తిప్పుకోనివ్వని ట్రీటిస్తున్నారు. ఇంతకీ ఎవరా ముద్దుగుమ్మలు.. అంటే? ఇలియానా-రష్మిక మందన్న- అనన్య పాండే- సోనాల్ చౌహాన్.. వాటర్ బేబీలుగా గుండెల్లో హీట్ పెంచారు. తాజాగా ఈ ముద్దుగుమ్మల పూల్ సైడ్ ట్రీట్ గురించి పరిశీలిస్తే.. ఇవిగో ఈ ఫోటోలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వేసవి మంటలు పెట్టేస్తుంటే పూల్స్ వెతుకుతున్నారు అందాల కథానాయికలు. వేడిని తట్టుకునేందుకు బాలీవుడ్ దివాస్ వాటర్ బేబీలుగా మారుతున్నారు. పనిలో పనిగా బికినీ లతో దుమారం రేపేందుకు.. బహుశా ఉత్తమ సమయమిదని భావిస్తున్నారు. రష్మిక మందన్న నుండి అనన్య పాండే వరకు.. వెటరన్స్ లో ఇలియానా - సోనాల్ సైతం ఈ తరహా ట్రీటిస్తున్నారు. భామలంతా మేజర్ పూల్ గోల్స్ ఇస్తున్నారు. రష్మిక మందన్న రిఫ్రెష్ అయ్యేందుకు ఈత కోసం కొలనులోకి దూకింది. కానీ ఒంటి కాలిపై దూకింది. అయితే నీటిలో ఈత రాని చేప పిల్లలా ఎలా బేలగా కనిపిస్తోందా కదా? అనన్య పాండే టినీ బికినీలో ఒదిగిపోయి ఎంతో తాధాత్మ్యంతో తన అభిమానులను ఉలిక్కిపడేలా చేసింది. ప్రస్తుతం ఈ బికినీ ఫోటోగ్రాఫ్స్ ని లైగర్ ఫ్యాన్స్ వైరల్ గా షేర్ చేస్తున్నారు. ఇలియానా డి క్రజ్ ప్రియుడు ఆండ్రూ నీబోన్ నుంచి దూరమైనా కానీ తన ఆసక్తులను వదులుకోలేదు. ఈ బ్యూటీ కూడా తన సంతోషకరమైన పూల్ సైడ్ ట్రీట్ పై ఫోటోలను షేర్ చేసింది. టోన్డ్ బాడీని టాన్ తో మింగిల్ చేయడం ఇలియానా ప్రత్యేకత అని పదే పదే ప్రూవ్ చేస్తోంది. దిశా పటాని అగ్గి రాజేసే ఏ ఒక్క అవకాశాన్ని విడిచిపెట్టదు. కొన్ని రోజుల క్రితం దిశా పటానీ ఈ బికినీ ఫోటోగ్రాఫ్ ని షేర్ చేయగా అంతర్జాలంలో దుమారం రేపింది. తన హాట్ నెస్ తో ఇంటర్నెట్ ను బ్రేక్ చేసింది. సోనాల్ చౌహాన్ తన బీచ్ వాకేలో బంచ్ ఆఫ్ ఫటోగ్రాఫ్స్ తో విరుచుకుపడింది. బికినీలో సోనాల్ ఎప్పుడూ నిరాశపరచదు. ప్రస్తుతం ఈ బ్యూటీ ఎఫ్ 3తో పాటు పలు చిత్రాల్లో నటిస్తోంది. ప్రతిసారీ బికినీలో అలరించేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదట. మిలింద్ సోమన్ భార్య అంకితా కొన్వార్ తన బీచ్ హాలిడే నుండి త్రోబాక్ ఫోటోని పంచుకోవడం ద్వారా తన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. భామలంతా బికినీ ఫెస్టివల్స్ లో బిజీ గా ఉన్నారు. వాటర్ బేబీస్ గా రికార్డులు తిరగరాయాలన్న కసితో ఉన్నారు. ఇక వీళ్లకు తోడు సారా అలీఖాన్ - జాన్వీ కపూర్- కియరా అద్వాణీ- అనన్య పాండే తదితర హాట్ గాల్స్ కూడా ఇటీవల తాము కూడా వాటర్ బేబీస్ అని నిరూపించారు.

## గ్లామర్ పాత్రలు చేయకపోవడానికి కారణం అదే: కీర్తి సురేష్

సినీ ఇండస్ట్రీలో కొందరు హీరోయిన్లు గ్లామర్ పాత్రలను ఎంచుకుని ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తుంటే.. కొందరు ముద్దుగుమ్మలు మాత్రం నటనకు మంచి స్కోప్ ఉన్న రోల్స్ ని సెలెక్ట్ చేసుకుంటూ స్టార్స్ గా ఎదుగుతున్నారు. ఈ రెండో రకానికి చెందిన హీరోయిన్ల జాబితాలో కీర్తి సురేష్ ఒకరు. మలయాళ సినీనిర్మాత సురేష్ కుమార్ ప్రముఖ నటి మేనక కుమార్తె అయిన కీర్తి సురేష్.. చదువుకుంటూనే బాల్య నటిగా పలు సినిమాలు చేసింది. 2013లో వచ్చిన 'గీతాంజలి' అనే మలయాళ మూవీతో హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చిన కీర్తి.. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కిన 'నేను శైలజ'తో తొలిసారి తెలుగు సినీ ప్రేక్షకులను పలకరించింది. ఆ తర్వాత వరుస సినిమాలు చేస్తూ




గుర్తింపు పొందిన ఈమె.. 'మహానటి'తో స్టార్ స్టేటస్ ను అందుకుంది. సావిత్రి క్యారెక్టర్లో కీర్తీ సురేష్ అద్భుతంగా జీవించింది. సావిత్రి తెరపైన నటిస్తుందా అనే ఫీలింగ్ను ప్రేక్షకులకు కలిగించింది. దీంతో సాధారణ ప్రేక్షకులు అభిమానులే కాదు విమర్శకులు సైతం కీర్తి సురేష్ పై ప్రశంసల వర్షం కురిపించారు. అయితే ఈ అందాల చందమామ ఇండస్ట్రీలోకి వచ్చి చాలా కాలమే అయినా.. ఇప్పటి వరకు గ్లామర్ పాత్రలను చేసింది లేదు. ఏ సినిమాలోనూ హద్దులు మీరి అందాలు ఆరబోసిందీ లేదు. కేవలం నటనకు ప్రాధాన్యత ఉండే పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తోంది. అయితే గ్లామర్ పాత్రలు చేయకపోవడానికి కారణం ఏంటో కీర్తి సురేష్ చెప్పేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. స్కిన్ షో పాత్రల గురించి మాట్లాడింది. 'నటిగా నా అభినయం ప్రేక్షకులు ఇష్టపడాలని ఎప్పుడూ కోరుకుంటాను. అదృష్టవశాత్తు నటనకు ఆస్కారమున్న పాత్రలే నన్ను వెతుక్కుంటూ వస్తున్నాయి. వాటితోనే మీ ఆదరణ పొందుతున్నాను. గ్లామర్ పాత్రలు నా మొదటి ప్రాధాన్యం కానేకాదు. అయినా తెరపై ఎలా కనిపించాలి అనే విషయంలో నాకు కొన్ని హద్దులు ఉన్నాయి.

వాటిని చెరపలేను. అందు కారణంగానే గ్లామర్ పాత్రలను చేయడం లేదు' అంటూ కీర్తి సురేష్ చెప్పుకొచ్చింది. కాగా సినిమాల విషయానికి వస్తే.. తెలుగులో సూపర్ స్టార్ మహేష్ బాబుతో కీర్తి కలిసి నటించిన 'సర్కారు వారి పాట' మే 12న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అలాగే మలయాళంలో ఈమె చేసిన 'చిన్ని' మూవీ ప్రముఖ డిజిటల్ సంస్థ అమెజాన్ ప్రైమ్లో మే 6న రిలీజ్ కాబోతోంది. అంటే వారం గ్యాప్ లోనే కీర్తి సురేష్ రెండు చిత్రాలతో సందడి చేయబోతోందన్నమాట.

## చెలికత్తెల మధ్యలో రాణివారు కిలకిలలు!

అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఓవైపు కెరీర్ పరంగా బిజీగా ఉన్నా వరుస వెకేషన్లతో రిలాక్స్ మోడ్ లోకి వెళ్లిపోతోంది. జాన్వీ నిరంతర ఫోటోషూట్ల గురించి తెలిసిందే. అల్ట్రా మోడ్రన్ ఫ్యాషనిస్టాగా ఇప్పటికే యూత్ కి కనెక్టయిపోయిన జాన్వీ చాలా రేర్ గానే ట్రెడీషనల్ లుక్స్ లో కనిపిస్తుంది. జిమ్ కి వెళ్లినా..యోగా సెంటర్లో ఉన్నా! టెంప్టింగ్ ఫోటోషూట్లకు కొదవేమీ ఉండదు. యువనటి భంగిమలకు కుర్రాళ్ల గుండెల్లో మంటలు చెలరేగాల్సిందే. ఇన్ స్టా వేదికగా ఆ ఫోటోలు అంతే వైరల్ గా మారుతున్నాయి. ఇది జాన్వీలో ఒక యాంగిల్ మాత్రమే. మరో యాంగిల్ లో జాన్వీ పదహారణాల అమ్మాయిలా ముస్తాబైతే ఎంత అదంగా కనిపిస్తుందో చెప్పాల్సిన పనిలేదు. అప్పుడప్పుడు యువరాణి గెటప్ప్ లో సైతం తళుక్కున మెరవడం జాన్వీ ప్రత్యేకత. తాజాగా




జాన్వీ యువరాణి ఆహార్యం లో ఓ ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారియింది. చెలికత్తెల మధ్యలో కిలకిలా నవ్వుతూ జాన్వీ ఎంతో అందంగా..ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఓ కవర్ పేజీ కోసం జాన్వీ ఇలా అందంగా ముస్తాబై కెమెరాకి ఫోజులిచ్చింది. ఈ ఫోటో సెషన్ కోసం ఏకంగా పురాతన సెట్ నే డిజైన్ చేసినట్లు కనపిస్తుంది. చెలికత్తెల కట్టుబొట్టు ఆహార్యం అద్భుతంగా ఉన్నాయి. మధ్యలో యువరాణి డిజైనర్ దుస్తులు ధరించి చెలికత్తెలుతో కబుర్లు చెబుతూ..నవ్వులు పూయిస్తూ కాలక్షేపం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. నెటి జనులు జాన్వీ అందాన్ని ఆకాశానికి ఎత్తేస్తూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం కరణ్ జోహార్ బ్యానర్లో దోస్తానా-2 లో నటిస్తోంది. అదే బ్యానర్ లో మరో రెండు చిత్రాలు కమిట్ అయింది. అలాగే అమ్మడు నటించిన గుడ్ లక్ జెర్రీ సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని రిలీజ్ కి రెడీగా ఉంది. మిలీ అనే మరో చిత్రంలో కూడా నటిస్తుంది. ఇక దక్షిణాదిన ఎంట్రీ ఇవ్వడానికి జాన్వీ ఆసక్తిగానే ఉంది. సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తుంది. ఆ ఛాన్స్ వస్తే వదులుకోవడానికి ఎంత మాత్రం సిద్దంగా లేదు. తల్లి తరహాలోనే అన్ని భాషల్లోనూ సినిమాలు చేయాలని ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ఈ విషయంలో తండ్రీ బోనీకపూర్ వెనుకుండి ప్రోత్సహిస్తున్నారు.

